నమ్మలేని నిజాలు

మైత్రి బంధాలు
ఆకర్ష వికర్షలు
రొక్కంతో ముడి

పూసినపూలు
కాలాలకు ప్రతీక
అత్తరయ్యింది.

అగ్నిపర్వతం
ఆకలి అమ్మజ్వాల
రెండూ లావాలు.

మాటల వల
పడితే వేపుడికి
మేధకు పని

మత్తుకు కిక్కు
చిక్కదు దొరకదు
కాకులగోల.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

ఆలయ పరిసరాలన్ని
మంత్రులంత సంవీక్షణ!
ముహూర్తం తేది ఖరారు
మహాకుంభ సంప్రోక్షణ !.

ఆవిర్భావ మవుతున్న
ఆవిష్కార దివ్యక్షేత్రం !
శ్రీలక్ష్మీ నారసింహ
విరాడ్రూప పుణ్యక్షేత్రం .

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ | గురువారం 21-10-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 73 | పేజీలు:6 | వెల: రూ.1/-


## మిలిటరీ బస్సుపై బాంబు దాడి..

# 13 మంది మృతి



డమస్కస్, అక్టోబర్ 20:: సిరియా రాజధాని డమస్కస్‌లో ఓ మిలిటరీ బస్సుపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో 13 మంది మృతిచెందినట్లు ఆ దేశ మీడియా పేర్కొన్నది. జిసర్ అల్ రయిస్ బ్రిడ్జ్‌ను దాటుతున్న సమయంలో రెండు బాంబులతో వాహనాన్ని పేల్చేశారు. వాస్తవానికి సిరియాలో గత దశాబ్ధ కాలం నుంచి ప్రచ్ఛన్న యుద్ధం సాగుతూనే ఉన్నది. అయితే ఇటీవల దేశ రాజధాని డమస్కస్‌లో మళ్లీ దాడి ఘట నలు పెరిగాయి. ఇడ్లిబ్ ప్రావిన్సులో ఉన్న అరిహ పట్టణంలో జరిగిన మరో దాడిలో అనేక మంది స్కూల్ విద్యార్థులు మృతిచెందినట్లు తెలుస్తోంది. అసద్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు 2011 నుంచి సిరియాలో ఉద్యమం నడుస్తోంది. ఇప్పటి వరకు ఆ పోరాటంలో 3.50 లక్షల మంది మరణించారు. సగం మంది జనాభా తమ స్వంత ఇండ్లను విడిచి వెళ్లారు.

## బుద్ధుడి ఆలయాన్ని సందర్శించిన మోదీ.. బౌద్ధ గురువులకు సన్మానం

ఖుషీనగం, అక్టోబర్ 20:: ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీనగర్‌లో ఉన్న మహాపరి నిర్వాణ ఆలయాన్ని ఇవాళ ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడ ఆయన అర్చన చేశారు. బౌద్ధ ఆలయంలో ఉన్న బుద్ధుడి విగ్రహానికి ఆయన చివార్‌ను సమర్పించారు. ఇక ఖుషీనగర్ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి వచ్చిన వివిధ దేశాలకు చెందిన బౌద్ధ సన్యాసులను కూడా ప్రధాని మోదీ సన్మానించారు. అబిద్ధామ దినాన్ని పురస్కరించుకుని ఆయన ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బౌద్ధ సన్యాసులకు చివార్ వస్త్రాలను అందజేశారు. శ్రీలంక, థాయిలాండ్, మయన్మార్, దక్షిణ కొరియా, నేపాల్, భూటాన్, కాంబోడియా దేశాలకు చెందని బౌద్ధ మతగురువులతో పాటు వివిధ దేశాలకు చెందిన అంబాసిడర్లు ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. మహాపరి నిర్వాణ ఆలయం వద్ద బౌద్ధ వృక్షాన్ని మోదీ నాటారు. చరిత్రకారుల ప్రకారం బుద్ధుడు ఖుషీనగర్‌లోనే తన తుదిశ్వాను విడిచినట్లు తెలుస్తోంది.

అశోక చక్రవర్తి కుమారుడు మహేంద్ర, కుమార్తె సంగమిత్రలు.. తొలిసారి బుద్ధుడి సందేశాలను శ్రీలంకకు చేరవేసినట్లు తెలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ రోజున శ్రీలంక బౌద్ధమతాన్ని స్వీకరించిందని, అరహత్ మహేంద్ర ఇండియాకు తిరిగి వచ్చి ఈ విషయాన్ని చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం వాతావరణ సంరక్షణ, వాతావరణ మార్పులు గురించి ఆందోళన చెందుతున్నామని, అయితే బుద్ధుడి బోధనలను అనుసరిస్తే, అప్పుడు మనం ఏం చేయాలన్న సంకల్పం కలుగుతుందని, దానితోనే మార్పు సాధ్యమవుతుందని ప్రధాని అన్నారు. శ్రీలంక మంత్రి నమల్ రాజపక్షకు భగవత్‌గీతను మోదీ గిఫ్ట్‌గా ఇచ్చారు.

# ఖుషీనగర్‌లో విమానాశ్రయాన్ని ప్రారంభించిన మోదీ

ఖుషీనగర్, అక్టోబర్ 20:: ఉత్తరప్రదేశ్‌లోని ఖుషీనగర్‌లో ఇవాళ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ యాత్రికుల కోసం ఈ విమానాశ్రయం ఎంతో ఉపయోగపడనున్నది. దశాబ్దాల ఆశలు, ఆశయాల ఫలితమే కుషీనగర్ విమానాశ్రయమని, ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని, ఇదో ఆధ్యాత్మిక ప్రయాణమని, ఇది ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ఖుషీనగర్ విమానాశ్రయం కేవలం ఎయిర్ కనెక్టివిటీ మాత్రమే కాదు అని, రైతులు, జంతు ప్రేమికులు, షాప్ ఓనర్లు, వర్కర్లు స్థానిక పారిశ్రామికవేత్తలకు దీని ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. వ్యాపార సముదాయ వాతావరణాన్ని క్రియేట్ చేస్తోందన్నారు. ఈ విమానాశ్రయం వల్ల పర్యాటక రంగం ఎక్కువగా లబ్ధి పొందుతోందన్నారు. స్థానిక యువతకు కూడా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. రానున్న 4 ఏళ్లలో దేశవ్యాప్తంగా 200 విమానాశ్రయాలు, హెలిపోర్ట్‌లను నిర్మించనున్నట్లు చెప్పారు. గౌతమ బుద్ధుడితో సంబంధం ఉన్న అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు. బౌద్ధ భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఖుషీనగర్ అభివృద్ధి కేంద్ర, యూపీ ప్రభుత్వ ఎజెండాలో ఉందన్నారు. యూపీలో కొత్తగా 9 విమానాశ్రయాలను నిర్మిస్తున్నామని, జివార్ విమానాశ్రయం దేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అవుతుందని ప్రధాని తెలిపారు. అంతకుముందు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా.. ప్రధాని మోదీని సన్మానించారు. యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుద్ధుడిని ఫాలోఅవుతున్న వారికి ఖుషీనగర్ ఓ ప్రధాన పర్యాటక ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ భక్తులు ఇక్కడకు వస్తుంటారు. గౌతమ బుద్ధుడు ఇక్కడే మహానిర్యాణం పొందారు. బౌద్ధ ఆధ్యాత్మిక యాత్రికులకు ఇదో చాలా ముఖ్యమైన యాత్రాస్థలం. ఖుషీనగర్ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీలంక నుంచి తొలి విమానం ఇక్కడ ల్యాండ్ అయ్యింది. ఆ విమానంలో శ్రీలంక మంత్రులతో పాటు బౌద్ధ మతగురువులు వచ్చారు.



## గాంధీ దవాఖానలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ , అక్టోబర్ 20:సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్? కారణంగా దవాఖాన నాలుగో అంతస్తులోని విద్యుత్ ప్యానెల్ బోర్డులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. మంటలను గమనించిన హాస్పిటల్ సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

అగ్ని ప్రమాదంతో దవాఖానలోని పలు వార్డుల్లోకి పొగ వ్యాపించింది. దీంతో రోగులు శ్వాస తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్రమత్తమైన సిబ్బంది ముందు జాగ్రత్త చర్యగా పలు వార్డుల్లోని రోగులను బయటికి పంపేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ ప్రమాదం వల్ల దవాఖానలో కరెంటు తీగలు దగ్ధమయ్యాయని, త్వరలోనే వాటిని పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

## వాల్మీకీ మహర్షికి మంత్రి ఎర్రబెల్లి నివాళి



హైదరాబాద్ , అక్టోబర్ 20:వాల్మీకీ మహర్షి జయంతి సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులర్పించారు. ఒక సామాన్యుడైన బోయవాడు అంత గొప్ప కవి కావడం మన దేశ సంస్కృతి గొప్పదనమని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పండుగలన్నిటినీ ప్రభుత్వమే నిర్వహిస్తున్నదని, గొప్ప కవులు, కళాకారులు, చారిత్రక పురుషుల జయంతి, వర్ధంతులు కూడా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్నదని వెల్లడించారు. వాల్మీకీ జయంతిని కూడా సర్కారే నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఇలా ఒక్క తెలంగాణలో తప్ప దేశంలో మరెక్కడా లేదన్నారు.

వాల్మీకీ రాసిన రామాయణం భారత ప్రజల పారాయణంగా మారింది. మనిషి బతికున్నంతవరకు అది ఉంటుందని చెప్పారు. వాల్మీకీ దక్షిణ భారత దేశమంతా తిరుగుతూ గోదావరి నదీ తీరాన కొంత కాలం ఉన్నాడని, అలా పాలకుర్తి నియోజకవర్గంలోని వల్మిడి గా (వాల్మీకీపురం) మారిన గుట్టల్లో కొంత కాలం తపస్సు చేశాడని చెబుతారని వెల్లడించారు.

## కేసీఆర్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ ఎన్నారైల తరపున నామినేషన్ వేసిన మహేష్ బిగాల



హైదరాబాద్ , అక్టోబర్ 20: టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. టీఆర్‌ఎస్ పార్టీ అధినేతగా మళ్లీ కేసీఆరే ఉండాలని పార్టీలోని అన్ని స్థాయిల నేతలు కార్యకర్తలు నినదిస్తున్నారు. పార్టీ నియమావళిని అనుసరించి నాలుగేండ్లకోసారి రాష్ట్ర అధ్యక్ష పదవి ఎన్నికలు జరుగుతాయి.

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేరును ప్రతిపాదిస్తూ టీఆర్‌ఎస్ ఎన్నారై శాఖల కోఆర్డినేటర్ మహేష్ బిగాల వివిధ దేశాల టీఆర్‌ఎస్ ప్రతినిధులతో కలిసి రిటర్నింగ్ అధికారి ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి కేసీఆర్ తరపున నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నారైలు అందరూ కేసీఆర్ అభ్యర్థిత్వాన్ని బలపర్చారని మహేష్ బిగాల తెలిపారు.

కార్యక్రమంలో సౌత్ ఆఫ్రికా శాఖ అధ్యక్షుడు నాగరాజు గుర్రాల,హరీష్ రంగ, సౌజన్ రావు, సాయి కిరణ్ వేముల, యూకే శాఖ నుంచి రత్నాకర్ కడుదుల, రమేష్ ఎస్సంపల్లి, శ్రీనివాస్ వల్లల, మల్లేష్ పప్పు, తాటికుంట వేణుగోపాల్, ప్రవీణ్ పంతులు, సుభాష్ కోరుపల్లి, తాటికుంట జనార్దన్ రెడ్డి, మాల్దీవుల శాఖ నుంచి అధ్యక్షుడు రాకేశ్ దత్తాత్రే యారా, కువైట్ నుంచి అధ్యక్షురాలు అభిలాష గొడిసాలా, జగదీశ్ ఉప్పల, ఇటలీ శాఖ నుంచి వినయ్, ఆస్ట్రియా శాఖ నుంచి వివేక్ , ఫిన్లాండ్ నుంచి సందీప్, ఇటలీ నుంచి వినయ్, జాంబియా నుంచి రాహుల్ రెడ్డి , వియాత్నం నుంచి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ ఇండియాపై కీలక నిర్ణయం తీసుకున్నాం: ప్రధాని మోదీ

ఖుషీనగర్, అక్టోబర్ 20:: ఎయిర్ ఇండియాకు సంబంధించిన కీలక అడుగును వేశామని ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ యూపీలోని ఖుషీనగర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. దివాళా దశలో ఉన్న ఎయిర్ ఇండియాను పునరుద్ధరించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. దేశంలోని పౌర విమానయాన రంగాన్ని ప్రొఫెషనల్‌గా నడిపించేందుకు, సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, భద్రత కల్పించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల భారతీయ విమానయాన రంగానికి కొత్త ఎనర్జీ వస్తుందని ప్రధాని అన్నారు. ఎయిర్ ఇండియాను 18వేల కోట్లకు టాటా సన్స్ సంస్థ బిడ్డింగ్‌లో దక్కించుకున్న విషయం తెలిసిందే.

## రెండు డోసుల టీకా తీసుకుంటేనే రక్షణ : డీహెచ్ శ్రీనివాసరావు

హైదరాబాద్ , అక్టోబర్ 20: రెండు డోసుల టీకా తీసుకోంటేనే కరోనాకు వ్యతిరేకంగా పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తొలి డోసు తర్వాత నిర్ణీత గడువులోగా రెండో డోసు తీసుకోవాలని సూచించారు. సరైన వేళకు రెండో మోతాదు తీసుకుంటేనే యాంటీబాడీలు ఉత్పత్తి అవుతాయని చెప్పారు.బూస్టర్ డోసుకు మనం ఇంకా దూరంగా ఉన్నామన్న ఆయన.. రెండు రోజుల తర్వాత మాత్రమే పూర్తి రక్షణ ఉంటుందని చెప్పారు. చాలా మంది మొదటి మోతాదు తీసుకున్న వారు సెకండ్ డోసు సరైన వేళకు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 36.35లక్షల మందికి రెండుమోతాదుల టీకాలు వేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 69లక్షల మంది ఒక్క డోసు లేదని పేర్కొన్నారు.

## టీఆర్‌ఎస్ ప్లీనరీ, విజయ గర్జనపై కేటీఆర్ సన్నాహక సమావేశం

హైదరాబాద్ , అక్టోబర్ 20:టీఆర్‌ఎస్ ప్లీనరీ, తెలంగాణ విజయ గర్జనపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇవాళ మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో కేటీఆర్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, రాజ్య సభ సభ్యులు కేశవరావు, చేవెళ్ల లోక్‌సభ సభ్యులు రంజిత్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, సురభి వాణి దేవి, కుర్మయ్యగారి నవీన్ కుమార్, యోగానంద్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్మన్ తీగల అనిత దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పెట్రో వాత.. పెట్రోల్‌పై 37, డీజిల్‌పై 38 పైసలు వడ్డింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. రోజువారీ సమీక్షలో భాగంగా దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్, డీజిల్‌పై 35 పైసల చొప్పున పెంచాయి. దీంతో న్యూఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.106.19కి చేరగా, డీజిల్ ధర రూ.94.92కు పెరింది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పెట్రోల్‌పై 34 పైసలు పెరిగి రూ.112.11కు, డీజిల్‌పై 37 పైసలు అధికమై రూ.102.89కు చేరాయి.ఇక హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై 37 పైసలు, డీజిల్‌పై 38 పైసల చొప్పున పెరిగాయి. దీంతో భాగ్యనగరంలో పెట్రోల్ ధర రూ.110.46కు, డీజిల్ ధర రూ.103.56కు చేరాయి. చెన్నైలో లీటరు పెట్రోలు రూ.103.31, డీజిల్ రూ.99.26, కోల్‌కతాలో పెట్రోల్ రూ.106.78, డీజిల్ రూ.98.03కు పెరిగాయి.తాజా పెంపుతో విమానాల్లో వినియోగించే జెట్ ఫ్యూయల్ ధరల కంటే పెట్రోల్ ధరలు 34 శాతం అధికమయ్యాయి. జెట్ ఫ్యూయల్ కిలో లీటర్‌కు రూ.79020.16 అంటే లీటర్‌కు రూ.79గా ఉన్నది.

## ఈటలకు రాజకీయ సన్యాసం తప్పదన్న మంత్రి కొప్పుల

కరీంనగర్ అక్టోబర్ 20:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అన్నివర్గాల సంక్షేమం కోసం ఆహర్నిషలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ కు అండగా ఉండాలని, హుజరాబాద్ లో గులాబీ జెండా ఎగురవేసి రుణం తీర్చుకోవాలనీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు.

బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించిన టీఆర్‌ఎస్ రోడ్డు షోలో మాట్లాడారు. తన స్వప్రయోజనం కోసం, ఆస్తులను కాపాడుకోవడం కోసమే ఈటల రాజేందర్ బీజేపీలో చేరారని విమర్శించారు. ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ఎస్సీ, బీసీ, అసైన్డ్ భూములను కబ్జా చేశాడని ఆరోపణలు వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈటలను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేశారన్నారు. దానిపై విచారణకు ఆదేశిస్తే, ఈటల తన నిజాయితీని నిరూపించుకోవాల్సింది పోయి, బీజేపీతో కుమ్మక్కై, మధ్యంతర ఎన్నికలు తెచ్చాడని దుయ్యబట్టారు.ఈటల రాజేందర్ కు రాజకీయ ఓనమాలు నేర్పి.. రాజకీయ భవిష్యత్ అందించింది సీఎం కేసీఆర్ అన్నారు. సీఎంపై అసత్య ఆరోపణలు చేస్తున్నఈటలకు ఉప ఎన్నికల్లో ప్రజలు రాజకీయ ఘోరి కట్టడం ఖాయమన్నారు. ఈ ఎన్నికతో రాజకీయ సన్యాసం తప్పదనీ బీజేపీ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు చేసిన మేలేమీలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రజలకు, రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముభారక్, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ ఇలా ఏదో ఒక పథకంలో తప్పక లబ్ధిదారులై ఉంటారని, ఆ విషయం గుర్తు చేసి, కేసీఆర్ రుణం తీర్చుకోవడం కోసం ఈ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి గెల్లు శ్రీనివాస్ ను భారీమెజారిటీతో గెలిపుంచాల న్నారు.

## ప్రియాంక గాంధీని మరోసారి అడ్డుకున్న యూపీ పోలీసులు

లక్నో, అక్టోబర్ 20:: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని ఉత్తరప్రదేశ్ పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. ఆగ్రాలో పోలీస్ కస్టడీలో మరణించిన వ్యక్తి కుటుంబాన్ని కలిసేందుకు బుధవారం ఆమె వెళ్తున్న వాహనాన్ని నిలిపివేశారు.

లఖింపూర్ ఖేరీ ఘటనలో హత్యకు గురైన బాధిత రైతు కుటుంబాలను పరిమర్శించేందుకు ప్రియాంక గాంధీ వెళ్లగా నాడు పోలీసులు అడ్డుకున్నారని, ఇప్పుడు కూడా మరో బాధిత కుటుంబాన్ని కలిసేందుకు ఆమె వెళ్తున్న వాహనాన్ని ముందుకు కదలనీయలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

అవసరమైన అనుమతులు లేనందునే ప్రియాంక గాంధీని నిలువరించినట్లు యూపీ పోలీసులు తెలిపారు. అయితే తాను ఎక్కడికి వెళ్లాలన్నా పరిమిషన్ తీసుకోవాలా అని ఆమె పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

కాగా, రూ.25 లక్షలు చోరీ చేసిన ఆరోపణలతో అరెస్ట్ అయిన అరుణ్ అనే వ్యక్తిని జగదీష్‌పురాలోని పోలీస్ స్టేషన్‌లో ఇంటరాగేషన్ చేస్తుండగా ఆరోగ్యం క్షీణించి మరణించినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి అతడ్ని ఇంటి నుంచి అరెస్ట్ చేయగా అనారోగ్యంతో ఉండటంతో ఆసుపత్రికి తరలించామని, అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు చెప్పారని ఆగ్రా సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు.

### చరిత్రలో నేటినిజం





- రాధశ్రీ
సెల్: 9494481210


Ministry of Culture
Government of India

Azadi Ka Amrit Mahotsav

సాహిత్య అకాదెమి
విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ
సహకారంతో నిర్వహిస్తున్న
కీ॥శే॥ వెలగా వెంకటప్పయ్య సంపాదకత్వంలో
సాహిత్య అకాదెమి ప్రచురించిన

బాలల మంచి కథలు
పుస్తక ఆవిష్కరణ

సోమవారం, 25 అక్టోబర్ 2021
సాయంత్రం 5.30 గంటలకు

వేదిక
వేమూరి అనిల్‌కుమార్ స్వాతి వేదిక
విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆవరణ,
గోపాల్‌రెడ్డి రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ

స్వాగతోపన్యాసం : కె. శివారెడ్డి, సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాదెమి
అధ్యక్షులు : పన్నాల సుబ్రహ్మణ్యభట్టు
ఆవిష్కరణ : రావెల సాంబశివరావు
తొలిప్రతి స్వీకరణ : వెలగా మానవేంద్ర
వక్తలు : బాలాంత్రపు ప్రసూన
అలపర్తి వెంకటసుబ్బారావు




సాహితీప్రియులందరికీ స్వాగతం

## చేనేత మొగ్గలు

పత్తిని శుభ్రంగా వలిచి వత్తులుగా చేసి
రాట్నము చేతభూని రత్నాలుగా ఆవిష్కరణ
నిరంతర శ్రమజీవులు మన నేతన్నలు..!

సహజ సుందరమగు నేత బట్టే
అవనిలో నిజమైన అందము ఆనందము
చేనేతను ఆదరిస్తే నేతన్నలకు మనుగడ..!

దారాన్ని క్రమపద్ధతిలో మగ్గానికి అందించే
అసలైన సాధనము నేతన్నల రాట్నము అసలైన రత్నము
రాట్నాలను ఆయుధంగా చేసే కలనేత నేతన్నది ..!

ఆసు పోయడంలోనే ఆయువంతా తీరిపోయినా
మగ్గం నేయడంలోనే బతుకంతా హారతి కర్పూరం
నిత్య శ్రామికులు మన చేనేత మగ్గం వీరులు

పత్తి పువ్వుల తోడ అందంగా వచ్చు
అద్భుతమైన ఆవిష్కరణ నేత ప్రపంచం
సృష్టికి ప్రతి సృష్టి చేసే పటిమ నేతన్నదే ..!

మగ్గం పై అల్లుతూ జరీ పూల వస్త్రమునేయడంలో
అందవేసిన అద్భుతమైన కళా నైపుణ్యత నేతన్నది
వారి బతుకులెప్పుడు అగమ్యగోచరం..!

చేప దంతముల ద్వారా పత్తి గింజలను తొలగించే
సూక్ష్మ పటిమ వారి సొంతం
అగ్గిపెట్టెలో చీర పట్టించే ఘనత నేతన్నది.!

నేత పనిలోనే బతుకంతా కోత పడినా
చేతకాక తనువంతా నీరసం
అలుపెరగక పయనం చేసేవాళ్ళు నేతన్నలు.!

దారంతో కళాత్మకంగా బొమ్మలు ఎన్నో
బట్ట మీద అందంగా తీర్చిదిద్దుతాడు
గొప్ప కళాకారుడు నేతన్న..!

ఇంద్రధనస్సు రంగులను ఒకచోట పేర్చి
మహిళలను ఆకర్షించే పనితనం వారి ఆస్తి
కానీ తినడానికి గింజ లేని బతుకు వారిది..!

ఉలితో శిల్పం చెక్కిన రీతిగా
మగ్గం మీద అద్భుతాలు సృష్టిస్తాడు
వారి పనితనం అజరామరం..!

అంతులేని కష్టాల్లో ఆనందాన్ని
వెతుక్కుంటూ జీవనయానం సాగిస్తారు
శ్రమ సౌందర్యానికి ప్రతీక చేనేత..!

కండెలకు దారం చుట్టడంలోఎంత
బలవంతులో జీవనంలో అంత నిస్సాహాయులు
రాత మార్చని నమ్ముకున్న చేనేత..!

పరుల హితం కొరకు పాకులాడుతారు
అకుంఠిత దీక్షతో నేత పని చేస్తారు
నమ్మిన మగ్గానికి జోహార్లు అందిస్తారు..!

పండుగంటే తెలియని పేద వాళ్లు
చేనేత గుంత లోని అన్నిపండుగలంటారు
మార్పు అనేది ఎరగదు నేతన్న బతుకు..!

మగ్గం మీద జన్మించిన నేత బట్ట
విదేశీయులకు కూడా ప్రియమైనది
నగిషీలతో తీర్చిదిద్దును నేతన్న..!

ఎల్లలు దాటిన మన చేనేత
స్వదేశంలో ఆదరణకు కరువు
బతుకు బతికించు నేతన్నను..!

జాలి మిల్లుల విస్తరణతో
మరుగున పడిపోయినది మగ్గము
ఏనాటికి వచ్చునో నేతకు పూర్వవైభవం..!

నేటి ప్రపంచంలో ఆధునిక వస్త్రముల రాకతో
త్రిశంకు స్వర్గంలా వేలాడుతుంది చేనేత
ఏనాటికీ దరి చేరునో చేనేత..!



-సునీత బండారు
9440671530

## చందమామ నడక

అమాయకపు గుట్టన్న కథలు (పిల్లల హాస్య కథలు)

గుట్టన్న ఒక రాత్రి ఆకాశం వంక చూశాడు. వాడికి ఆకాశంలో చంద్రుడు, కొన్ని మబ్బులు కనిపించాయి. చంద్రుడు పరుగెత్తినట్లు అనిపించి వాడు గట్టిగా" అదిగో !చంద్రుడు ఆకాశంలో పరుగెత్తుతూ ఉన్నాడు. ఏదో ప్రళయం వస్తున్నది "అని బిగ్గరగా అరిచాడు. కానీ వాస్తవంగా పరిగెడుతున్నవి మబ్బులు. కానీ వాడికి చంద్రుడు పరిగెడుతున్నట్లు అనిపించింది.

వెంటనే అక్కడికి వచ్చిన పెద్దమనిషి" ఒరేయ్!ఆకాశంలో మబ్బులు పరుగు పెట్టడం సహజం. చంద్రుడు పరుగెత్తడు. మబ్బులు లేనప్పుడు చూడు. అప్పుడు నేను నీ మాటలను నేను నమ్ముతాను "అని అన్నాడు. కొద్దిసేపటికి ఆకాశం నిర్మలంగా అయింది. అప్పుడు గుట్టన్న ఆకాశం పైకి చూశాడు .చంద్రుడు కదలకుండా ఉన్నాడు." అవును! ఆ పెద్దమనిషి చెప్పింది నిజమే. నేనే పొరబడ్డాను" అని సిగ్గుతో తలవంచుకొని "చంద్రుడు పరిగెత్తడు .కానీ నడుస్తాడు "అని అందరికీ చెప్పాడు.

ఒక బాలుడు " చంద్రుడు నడవడు " అని అంటే "నీవు చిన్నపిల్లవాడివి .నీకు తెలియదు. అలా చంద్రుడు నడవకపోతే మనకు ఒక గంట తర్వాత ఆకాశంలో ముందుకు ఎందుకు కనిపిస్తాడు? ఈ తూర్పుదిక్కు నుండి ఆ పడమర దిక్కుకు ఎలా పోతాడు "అని అన్నాడు. "అతనికి కాళ్లు లేవు" అని ఆ బాలుడు అంటే " బంతి లాగా దొర్లుతాడు" అని అన్నాడు గుట్టన్న. ఆ మాటలు విని ఆ బాలునికి పాటు, అక్కడున్నవారు అందరూ నవ్వుకున్నారు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

## కళ్ళలో ఒక నది

కళ్ళలో ఒక నది ఒక చెట్టు
ప్రవహించే కాలం ముడిపడుతుంటాయి .

లోపలి మనిషి ఒక్క సారీ
బహిర్గత మౌతుంటాడు.

అంతర్ధానమౌతున్న విలువల ముందు
జీవితాలు అనేక రూపాల్లో రాలుతున్నా
కడగబడుతున్న క్షణాల్లో
ఇంకో పార్శ్వముగా
దివ్య రేఖలు అద్దుతుంటాయి .

చెదిరిపోని ఊహలు
గూళ్ళను నిర్మిస్తాయి .
అల్లుకున్న తపనలు
చిగురులు తొడుక్కుంటాయి .

ఒక దాహం నది తీర్చినట్లు
ఒక ఎండని చెట్టు ఆపినట్లు
కాలం దొంతరల్లో
ఒక ప్రయత్నం
ఎన్నో కాంతుల్ని విసురుతుంది .

శ్రమ ఉదయించడంలో
విజయాలు తడుతుంటాయి.

అక్షరాల కాంతిలో
ఇలా రేపటి స్వప్నాలని నిర్మించుకుంటూ ..

అడవి పూల సౌందర్యాన్ని
పారే నదీ ప్రవాహాల్ని
చెట్టున వాలే పక్షుల్ని
నాలో ఊహల్నీ
ప్రవహించే కాలం ముద్రిస్తుంది!



-గవిడి శ్రీనివాస్
08886174458

## బంగరు భారతంలోనికి!!!

కాల చక్రంలో
'ధర్మమనే' ఇరుసు
తిరిగి తిరిగి
అరిగి...విరిగి
ఇక
ముందుకు
మున్ముందుకు
కదలనని,
కదలలేని
మూగగా రోధిస్తుంటే....
అలసి సొలసిన
ఋతువుల గురుతులు
కృతకమై...
వికృతమై.....
ధారల దారాల
స్మృతులు విస్మృతులై
ఇసుక మేటులకు
నిలయమై
పుడమి తల్లి ఒడలపై
నెర్రులకు విలయమై.....
ప్రకృతి చేస్తోన్న.....
వికృత వికటట్టా హాసానికి
పరిహాసపు పరిహారానికి
ఆనవాళ్ళలవుతున్నాయి.
పంటల గుట్టలు సొట్టలు కాగా
పైరుల ని'రాశు'లు
కర్షకుల కళ్ళు బైర్లు కమ్మే'లా'
చేస్తున్నాయి.
అమృతం పంచి పెంచిన
'అమ్మ'ను అమ్మక అమ్ముకో'(లే')క
జన జీవనానికి ఆలంబన, ఆదరువైన
అరకును అటకెక్కించ(లే)క
వడ్డీల బిడ్డల గడ్డివాములు
నడ్డి విరుస్తుంటే....
రుణాల వ్రణాలు
కాయాన్ని గాయాల'పాలు' చేస్తుండగా
వస్తోన్న పుట్టెడు దుఃఖాన్ని
పంటి బిగువున అధిమిపెట్టి
ఆత్మాభిమానం చేస్తోన్న ఆర్తనాదాన్ని
అధిగమిస్తూ.....
విధిచేసిన వి(ని)ధి లేని
స్థితిని, పరిస్థితిని
విధిగా, విధి విధానంగా
నిదానంగా,ప్రధానంగా ఎదుర్కోవాలని
పజకు పట్టెడన్నం పెట్టి
ధర్మాన్ని రక్షించాలని
ఖర్మను,కర్మతో.....
ధాటిగా దాటాలని నడుం బిగించి
'స్వధర్మ'మే శ్రేయస్సని
'పరధర్మం' భయానకమని భావిస్తూ.....
మొక్కే 'మొక్కు'ని,సర్వమని,సర్వస్వమని
మొక్కే శరణమని శరణ్యమని
మొక్కకు మొక్కుతూ...మొకరిల్లుతూ...
'ధర్మోరక్షతి రక్షితః'ని మస్తిష్కంలో
మననం చేస్తూ...
'వృక్షోరక్షతి రక్షితః'ని ఎదలో శపథం చేస్తూ...
మొక్కలో ధర్మాన్ని దర్శిస్తూ.....
ధర్మమే మొక్కగా, మొక్కే ధర్మంగా
మొక్కే వేదంగా,జీవనాదంగా స్మరించాలని
పది మందికి చాటుతూ....
గంపెడు ఆశతో,బండెడు భరోసాతో...
అడుగులు నేలకు ఆన్చి
పరుగులు తీస్తున్నాడు కర్షక వీరుడు

బంగరు భవితలో(ని)కి!!,
బంగరు భారతంలోనికి!!!
శుభంభూయాత్!!!



-రాళ్లబండి సంగంనాయుడు,
9490935258

## జీవన సౌరభం...

పుట్టి పెరిగే వరకు జీవితం
పలు దశలన్నీ దాటుకుంటూ
ఓ తీరం చేరుకుంటుంది
మన ప్రమేయంలేకుండానే.

ప్రతి మనిషికి జీవితం లో
కొన్నిఆశలు కొన్ని లక్ష్యాలు
అవి నెరవేర్చుకునే పోరాటంలో
కాలం నెమ్మదిగా కరిగిపోతుంది

డబ్బు సంపాదన దారి కొందరిది
కీర్తి ప్రతిష్టల యావ ఇంకొందరిది
సేవే పరమావధి అనుకొనేవారు
భక్తి ముక్తి మార్గం మరికొందరిది

భగవంతుడు రాత్రి పగలు ఇచ్చి
అన్నిటినీ సాధించుకోమన్నాడు
కొన్నెప్పుడూ గగన కుసుమాలే
స్వప్న కుసుమాలే ఆ లోటు తీర్చేది

ఆశలు,ఆశయాలు నెరవేరక పోయినా
కాలం కలసి వచ్చిన నాడు
స్వప్న కుసుమాలు విరబూస్తాయి
జీవితం లో సౌరభం నింపుతాయి.



– డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి
9849331554

## అమ్మ మధురస్మృతుల భాండాగారం

స్మృతి పటలం నన్ను సుతిమెత్తగా
తట్టిలేపి మూడేళ్ల ప్రాయాచిత్రాన్ని చూపించింది
వేకువ తో విప్పుకున్న అమ్మ పని రెక్కలు
అవిశ్రాంత కృత్యాలకు అంకితమయ్యాయి

ఇంటిలో ప్రతీ మూలమూలకీ , ప్రతీ వస్తువుకీ ,
వంటింట్లో ప్రతీ దానికీ అమ్మ చేతి స్పర్శ లేకుంటే
చైతన్యమే రాదు
కుటుంబ సభ్యులందరి గొంతులో పిలుపు,
అవసరాలకు తలుపు, అందరికీ సంతృప్తి నిచ్చే వేలుపు

అమ్మకున్నవి రెండు చేతులే
అవి పదహారు లా కనిపిస్తున్నాయి
పనిలో ఆనందం పహారా కాస్తోంది కదా!
అలుపూ సలుపూ దరికే రావట్లేదు.
అన్ని పనులు మొలచుట్టూ ఉన్నాకూడా
చంకలో నాకు జాగా ఇస్తోంది

మధ్యమధ్యలో నాకు బుజ్జగింపుల మంత్రాలు
లాలింపుల తాయిలాలు.

వీధి గుమ్మం లో నా హుషారుకు కళ్ళెంవేసేలా
ఓ ఆకతాయి ప్రమాదం నా మునుకులు
చెక్కేసింది ఫలితంగా ఏడుపు కన్నీటి కుళాయి విప్పేసింది.

ఆ కేకలు అమ్మ పనిచక్రానికి అడ్డంగా కర్రను వేసాయి
కన్నా ! అంటూ వాలిన అమ్మ చేతులు నన్ను అక్కున తీసుకున్నాయి
థూథూ ఛీఛీ అన్నా!పోవే అంటూ పీడను తరిమాయి
అమ్మ పలుకులూ చేష్టలు నాలో బాధను మయిమరిపించాయి.

అమ్మ చంకలో నన్ను తీసుకుని తలలో మొలలో
పనులన్నింటికీ నేనున్నాలే అంటూ
పలకరిస్తూనే ఉంది.



-చావలి శేషాద్రి సోమయాజులు
7013344354

## చురకలు -నానీలు

ఉచితం
పరిగెత్తి పాలు తాగేది
ఉపాధి
నిలబడి నీళ్ళు తాగేది.

ధరలకు
రెక్కలున్నాయి సరే
ఆదాయాలకు
తోకలు ఉండాలిగా

వాగ్ధానాలు
అటకలెక్కుతున్నాయి
అటకలు మోసేది
ఎప్పుడూ నిందలే

పదవుల
పందేరాలు సరే
ఉద్యోగాల
నియామకాలు ఎప్పుడు?

నీలి నీడలో
మద్యపాన నిషేధం
అధిక ధరలకు
పెద్దల ఆమోదం



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## విశ్వాసమే అండగా

ఓ దుఃఖ బావిలో
చెదలుపట్టిన మనుషులను తోడుతున్నా!
దొరికిన మనసుల
మూటలను ఒక్కొక్కటిగా విప్పుతున్నా!
తెరిచి చూస్తుంటే ఊహించని
తెరచాటు చిత్రాల కథలే!
కులకుంపటీని రాజేసిన
మతాల మతలబుపై రెట్టేసిన
కొత్త ముసుగు తొడుక్కున్న
నటనాగ్రేసురుల విశ్వరూప చరిత్రలే!

గల్లీ నుంచి డిల్లీ దాకా
అడుగడుగున అవినీతిని కప్పుకొని
గరుడ పక్షులు కోక్కొల్లలుగా
విస్తరాకులపై భోజనం చేస్తున్నయ్!

ఇసుక తిన్నె పెదవులపై
ఓనమాలు దిద్దని పసితనపు
ప్రాయాల నుండి
రెక్కలు వాల్చలేని ముసలి ముతక నుండి
భావిభరత నవయుగ చైతన్యం నుండి
ఎందరికో మాయమాటలు చెప్పి
చెమట చుక్కలను దోచుకుంటూ..
నీతిని వాగ్ధానాలను గాలిలో వదిలేసి
స్వార్థచింతన గర్భమున పుట్టి
నేలతల్లిపై పాదం మోపనీ
రంగుజెండాల అగ్రేసురులను కనుగొంటున్నా!

వెట్టిచాకిరితో హూనమై పోతున్న
కరువు కోరలు కాటేస్తున్న
నిరుద్యోగ చెలిమి అగ్నైపోతున్న
బతుకులు కొలిమిలా మారుతున్న
పోరాటం ఊటబావిలా
ఊపిరై నిలిస్తున్నది
ఎప్పటికైనా
భవిష్యత్తు తరంలో
అంతా శుభసూచికలు
భారతదేశ ఖ్యాతి రేఖపై
విరజిల్లుతుందని నమ్మకంతో
స్వచ్ఛమైన గెలుపు
విశ్వాసమే అండగా
ముందడుగై నడిపిస్తున్నదని!!



-పగిడిపల్లి సురేందర్ పూసల
8074846063

## 'దైవ జీవులు!'

నోరులేని ప్రాణులు
వన్య ప్రాణులు!
దేవుని సృష్టిలో భాగాలు
స్వార్థమెరుగని జీవాలు!

వనాలను ఆసరా చేసుకుని
స్వేచ్ఛగా సంచరిస్తూ
తమ జీవనం సాగిస్తూ
ప్రశాంత జీవితం గడుపే
అమాయక జీవులు!

చెట్టూ–చేమలను నమ్ముకొని
గడ్డి పరకల దాణాతో తృప్తిపడి
రేపటి కోసం దిగులు చెందని
పచ్చని అరణ్యంలో
కనువిందు చేసే నిస్వార్థ జీవులు!

చెట్ల నీడలో సేదతీరుతూ
సహజ తటాకంలో గొంతు తడుపుకుని
చెంగు చెంగున గెంతుతూ
కోనకు ఆభరణాలై
కనులు మిరుమిట్లు గొలిపే
కాంతి చిహ్నాలు!

జీవ సమతౌల్యం కోసం
మాంసాపేక్షగల జీవులుగా
శాఖపాకములు భుజించు ప్రాణులుగా
తమ తమ ధర్మాలను
నిర్వర్తించే నోరు లేని జీవులు!

మాటకు దూరమైనా
కంటి చూపుతో సమస్తం గ్రహించే
పరిణితి చెందిన ప్రాణులు!
విశ్వాసానికి ప్రతిరూపాలు!

వేటాడుట విసర్జించు
జీవ వధను వర్జించు!
ప్రాణులను హింసించడం మాని
వాటి మనుగడకు
నీవంతు సాయం అందించు!

అందుకే...
వనాలను రక్షించు
వన్య ప్రాణులను కాపాడు!
మూగ జీవులను ప్రేమించు
ప్రకృతి ధర్మానికి సహకరించు!



-వంగర.
పరమేశ్వరరావు
9491400534

## అమ్మలాంటి తరువులను కాపాడుకోండి

ప్రాణవాయువునిచ్చు దాన్నిరా..
ప్రాణాలు తీయబోకుమయ్యా..
పండ్లు ఫలాలనిచ్చు దాన్నిరా..
ప్రకృతిని పాడుచేయకుమయ్యా..

నీ మనుగడ సాగుకోసం
నా మరణాన్ని కోరుకోకుము..
నీ బతుకు బండి నడుచుటకు..
నన్ను నాశనం చేయబోకుము..

పుట్టిన నుండి గిట్టే వరకు..
పలువిధాలుగా మేలు చేస్తిని..
పెంచి పెద్ద చేసినది మరిచి..
వస్తివి ప్రాణం తీయుటకుని..

పర్యావరణాన్ని కాపాడుతు..
మీ ప్రగతిని కోరుకుంటాను..
పదికాలాలు బతకాలని..
ప్రాణవాయువునందిస్తాను..

పచ్చని చెట్టైనా మమ్మల్ని..
కాపాడుటకు పూనుకొండి..
కన్నతల్లి లాంటి మా మనసును.
అర్థం చేసుకుని జీవించండి..



-పసుల.శంకర్
9542181301

## అనివార్యం....

భూమిపొరల్లో ఒదిగినవిత్తనం
తనలో తానే మార్పుకులోనై
తానెదిగే క్రమంలో విశ్వమే తనువై
విస్తరిస్తుంది పరివర్తనే శ్వాసయై

పరుగిడుతున్నకాలం అలాగే
నిర్మలంగా సాగిపోతూన్నా
ఉవ్వెత్తునఉప్పెనలా లేచినా
మార్పుకు అది కట్టుబానిసే...

శిశిరమే తనకు దిక్కని మోడుబారి
ఎండినరెక్కలతో చెట్టు కళతప్పి
చేసుకోదు నిరాశతో ఆత్మహత్య.
వసంతాగమనం మదినింపుకొని
కొత్తచిగుర్లు తొడిగి పచ్చని దుప్పటి
ఒంటిని కప్పుకుని పరవశించిపోతుంది.

గొంగళిపురుగు రంగులహరివిల్లయి
సీతాకోకచిలుకలా రూపమెత్తిందంటే
ముమ్మాటికీ దశలవారి క్రియలప్రతిచర్యనే.
ఉన్నట్టే ఉంటానంటే బండకూ బతుక్కూ
ఉండేది విలువే లేని గుండుసున్నా తేడానే.
ఆహ్వానించు ఆశ్వాదించు అనుసరించు
అనివార్యమైన మార్పును అంగీకరించు....

నిజమే మార్పును ఒప్పుకోవాలంటే అసలు
మనసొప్పది గిరి గీసుకున్న పాదాలకు
మూసవిధానమే స్వర్గసుఖమని
కాలప్రవాహంలో కొట్టుకుపోవడమే నయమని.

మార్పు సజీవం అతిసహజం ప్రగతి చక్రం
రేపు తెచ్చే మార్పుని పసిగట్టి మసలుకుంటూ
ముందు చూపుతో కట్టుకో మెట్టుపై మెట్టు
అదే అందలం ఎక్కించే నిజమైన కనికట్టు.



-లక్ష్మణ్ మంచికట్ల
9494800112

## జీవన నావకు చుక్కాని

మేధో మహావృక్షం గురువు
విజ్ఞాన నీడను పంచే
విశ్వాసం నింపే చెలిమె
తడబడినపుడు ఊతకర్ర !

కనిపించే దైవరూపం
నీడలా రక్షించే శక్తిరూపం
విజ్ఞాన వనరుల కేంద్రం
ఎదుగుదలలో ఉత్ప్రేరకం !

శాస్త్రసాంకేతిక నైపుణ్య నిధి
వ్యక్తిత్వ వికాస పునాది
శ్రేయస్సును కోరే పెన్నిధి
విజ్ఞాన వివేకాల సన్నిధి !

నవ యువ తరాల నిర్మాత
సామాజిక చైతన్య గీతిక
విజ్ఞాన వితరణకే వెన్నెముక
జ్ఞాన విత్తులు నాటే కర్షకుడు !

శిలను శిల్పంగా చెక్కే శిల్పి
మదిని సుసంపన్నం చేసే నిధి
పువ్వుకు పరిమళమద్దే చేయి
జీవనోపాధి చూపే జ్ఞాని గురువే !

ఉన్నతిని కోరే ఊటబాయి
నీడలా రక్షించే గొడుగు
విజ్ఞానమే సంపదైన వివేకి
నిస్వార్థ లోక హితవరి !

జన దేవాలయ పూజారే కాదు..
జీవన సౌందర్య ప్రాణవాయువు
గురు ఉపదేశాలే దిశ నిర్దేశాలు
గురువు కదా జీవన నావకు చుక్కాని !



-బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## సృజనమేస్త్రి!

ఇతివృత్తం పునాదులు తీసి
కథాంశాల స్తంభాలు వేసి
పదాలతో ఇటుకలను పేర్చి
భావాలతో సిమెంటును కూర్చి
అలంకారాల రంగులను అద్ది
అందంగా కావ్యభవనాన్ని తీర్చిదిద్ది
సహృదయులకు అందించే
చక్కని మేస్త్రీ
కవి!



– డా॥ అందూచితం నటేశ్వరశర్మ –
9440468557.

## అష్టోత్తర శత కథా సుమమాల...!

పుస్తక సమీక్ష

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యాశీస్సులతో కలం పట్టిన ఆదూరి హైమవతీ శ్రీనివాసరావు గారు.. బాల వికాస్ గురువుగా పిల్లలను దృష్టిలో ఉంచుకుని, వారానికి ఓ కథ చెబుతూ.. తద్వారా మానవతా విలువలను పెంపొందించారు. అలా పిల్లలను ఉద్దేశించి రాసిన కథలను ఏర్చి కూర్చి.. "అష్టోత్తర శత కథా సుమమాల..!" పేరుతో ఓ గ్రంథాన్ని వెలువరించారు. 'బాలవికాస్" బాల బాలికలకు ఉపయుక్తంగా ఉండేందుకు పిల్లలకు మూడు వర్గాలుగా విభజించి రాయబడ్డ కథలివి.

మానవతా విలువలు.. కథలకు శోభను కూర్చాయి. అంతేగాక సత్యసాయి పద్యసూక్తులు, వాక్య విభూదులు, సామెతలను జోడించి మరింత బలాన్ని కూర్చారు. రచయిత్రి హైమావతి శ్రీనివాసరావుగారి కలం నుండి జాలువారిన ఇందలి కథల్లో.. నీతిని ప్రబోధించి.. చిన్నారులను సంస్కారవంతులుగా మలిచే ధ్యేయంతో మన దైనందిన జీవితంలోని సన్నివేశాలు.. ఇతివృత్తాలు.. పాత్రలు.. నిత్య జీవితంలో తారసపడే సంఘటనలకు చోటు కల్పించారు. తల్లిదండ్రుల పట్ల.. దేశంపట్ల.. ధర్మంపట్ల శ్రద్ధాభక్తులను పిల్లల్లో అలవర్చేందుకు ఇందులోని కథలు ఉపయోగపడతాయి.

సత్యం.. ధర్మం.. శాంతి.. ప్రేమ.. అహింసలనే మానవీయ విలువలకు పట్టం కడుతూ అల్లిన కథలివి! మన సంస్కృతీ సంప్రదాయాలను పునరుద్ధరిస్తూ, పిల్లల మనసుల్లో దివ్యత్వం నెలకొల్పాలన్న సంకల్పంతో.. రచయిత్రి 'బాల వికాస్' లక్ష్యాల సాధనలో సఫలం కావడం అభినందనీయం.

మానవ సంబంధాలు మసక మారుతున్న ప్రస్తుత తరుణంలో.. మానవత్వం క్రమంగా కనుమరుగవుతున్న ప్రస్తుత నేపథ్యంలో.. సామాజిక చైతన్యానికి.. సదాచార సంపన్నులుగా మలచడానికి ఈ కథలు ఎంతగానో దోహదపడతాయి.

కథలంటే ఇష్టపడే చిన్నారుల అభిరుచికి అనుగుణంగా మానవత్వ విలువలు వారిలో పెంపొందించేందుకు.. రచయిత్రి చేసిన కృషి ప్రశంసనీయం.






ఇందలి కథలు విన్నా.. చదివినా.. పిల్లల్లో నైతిక విలువలతో పాటు జాలి, దయ, కరుణలాంటి సద్గుణాలు ఇట్టే అలవడుతాయి.

చక్కని సందేశం.. నీతి.. సరళత్వం.. మృదుత్వం.. ముక్కుసూటితనం..వంటి లక్షణాలతో వెలువడిన ఈ కథలు వినయం.. విధేయత.. వివేకం.. క్షమ.. త్యాగం.. లాంటి సదాచారాలను ప్రసాదించేలా కొలువుదీరాయి..

'సత్యం' అధ్యాయంలో పొందుపరిచిన కథలు ఆత్మ విశ్వాసాన్ని నింపడానికి వీలుకలుగుతుంది. మాటతీరు ఎలా ఉండాలో.. సత్యవాక్కును మరువరాదని.. తెలియజేసేలా ఉన్నాయి. సహనంతో సహవాసం చేయాలనీ.. మురికి మాటలు మాట్లాడవద్దనీ పెడదారి పట్టవద్దని హితవు పలుకుతాయి.

'ధర్మం' అధ్యాయంలో పొందుపరిచిన 22 కథలను స్నేహం.. విచక్షణ.. గురుభక్తి.. సమయపాలన.. నాయకత్వ లక్షణాలు వంటివి పిల్లలు అలవర్చుకునేందుకు వీలుగా తీర్చిదిద్దడం విశేషం.

తర్వాతి అధ్యాయంలో 'శాంతి' అంశానికి చోటు కల్పించారు. ఇందులోను 22 కథలున్నాయి. ఈ కథలు బాల బాలికల్లో అణకువ.. నిజాయితీ.. మౌన సామర్థ్యం.. ఒదిగుండే లక్షణాలు నిర్మాణం చేసేందుకు దోహదపడతాయి.

'ప్రేమ' అధ్యాయంలోని 21 కథల్లో.. సత్యమహిమను.. తల్లిప్రేమను..క్షమాగుణం.. దానగుణం.. వంటి అంశాలను పొందుపరిచారు.

చివరి అధ్యాయం 'అహింస'లోనూ 22 కథలున్నాయి. ఈ కథల ద్వారా మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల శ్రద్ధాభక్తులు కలిగించే ప్రయత్నం చేశారు. పొదుపు.. పల్లెసేవ.. దానగుణం.. గురుదక్షిణ.. సమానత్వం.. సేవాభావం వంటి సద్గుణాలను బాలబాలికల్లో అలవర్చడానికి రచయిత్రి ఆదూరి హైమావతి శ్రీనివాసరావుగారు ప్రయత్నించిన తీరు ప్రశంసనీయం.

ఇలా.. "అష్టోత్తర శత కథా సుమమాల'గా రూపుదిద్దుకున్న ఈ గ్రంథంలోని కథలను పిల్లలతో చదివించి.. సంస్కారవంతులుగా మార్చడానికి వీలున్నది. ప్రతీ పాఠశాలలో.. ప్రతీ గ్రంథాలయంలో ఉండదగిన గ్రంథమిది!

చిన్నారులకు చదువొక్కటే కాదు.. చదువుతో పాటు సంస్కారాలను అందించేందుకు.. వారిని సదాచార సంపన్నులుగా తీర్చిదిద్దడానికి ఈ కథలను బోధిద్దాం.. పిల్లలతో చదివిద్దాం..

**ప్రతులకు:** బాలవికాస్
సెల్:8558899478
8790224030



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## ఆశయం

పల్లవి: ఓ చిలకా! వినవమ్మా, ఒక మొలక కథ చెబుతా
ఆశయమున్నతమైతే ఆకాశమే నీదరికొస్తుంది
అవనిలో అందరు సలాము చేసి గులాములైపోతారు ॥ఓ చిలకా॥

చ॥ మొలక, మూలం రెండున్నూ ఒకే విత్తులో ఉంటాయి
మంచి, చెడ్డ భావనలు నీ మనస్సునందు యున్నట్లే
నేలను చీల్చి వచ్చిన మొలక ఎంతో ఎత్తుగ యెదుగుతుంది
జీవరాశులు ఎన్నిటికో జీవనాడిగా నిలుస్తుంది ॥ ఓ చిలకా॥

మొలకతో పాటే వచ్చే మూలం నేలకిందికి పయనిస్తుంది
ఎంత లోతుకు వెళ్ళినప్పటికి వెలుగును చూడదు వెర్రిబాగుది
గాలి, వెలుతురు దేనిని పొందక నిత్యం సతమతమౌతుంది
చీకటిలోనే మగ్గుతుంది చివరకు చిద్రం అవుతుంది ॥ఓ చిలకా॥

విత్తుతో పోల్చి చూసుకుంటే మనిషైనా యింతేరా
మంచి ఆశయం మనసున నింపి, కొంచమైన అలసత్వం లేక
కష్టపడి పనిచేయాలి, కండరాలు కరిగించాలి
ఆకసమంత ఆశయమైతే అవలీలగ నువ్ సాధించొచ్చు. ॥ఓ చిలకా॥

జీవితమెంతో చిన్నదైనా, జీవించొచ్చు కలకాలం
వివేకనందుడు, భగత్‌సింగు, శంకర భగవత్పాదులు
ఎందరో వ్యక్తులు ఆదర్శంగా నిలిచారీ పుణ్యభూమిలో
వారందరు నీకు కావాలి ఆదర్శం ఎన్నటికీ ॥ ఓ చిలకా॥

ఆశయ సాధనే లక్ష్యంగా అలుపెరుగని పోరు సాగించు
అవరోధము లెన్నెదురైనా వెనుదిరగక ముందుకు సాగిపో
సవ్యదిశలో నువు సాగాలి, నవ్యపథంలో నడవాలి
సవ్యసాచిలా సాధన చేస్తే దివియైన నీ దరికొచ్చునులే. ॥ఓ చిలకా॥



– చింత రమణ
సెల్: 9701652766

## ఎక్కడిదో చల్లగాలి

మెల్లగా పిలిచినట్టుగా నా ఒళ్ళు పరీక్షించింది
వాన మబ్బు నా మనసును ప్రేమతో పలకరించింది
చల్లని వెన్నెలంతా స్పర్శ
మా అమ్మ మనసు అంత చల్లగా సముద్రమంతా ఉప్పొంగి పోతుంది
ఎక్కడిదో ఈ చల్లగాలి ఎక్కడో కురుస్తున్న వర్షాన్ని
నా గుండెల్లో గుబులు రేపుతోంది
అందుకే ఈ వేళ మట్టి వాసనలు ఈ చల్లగాలితో పాటు
నా ముక్కుపుటాలను తాకి కలిగిస్తున్నాయి హాయి హాయిగా.



-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

## గుప్పెడంత ఆశ గుండెల్లో...

మనం కళ్ళు
మూసుకుంటే
... "కటికచీకటి"
...అది మన సృష్టి

సూర్యుడు
పశ్చిమకొండల్లో
కన్నుమూస్తే
..."చిమ్మచీకటి"
...అది సృష్టికర్త సృష్టి.

మనిషి లైట్లు ఆర్పేస్తే
..."అంధకారం"
...అది మానవ సృష్టి

చీకటికి...ముందు
"వెలుగే" ఉంటుంది
..."అది నిజం"
చీకటికి...వెనుక
"వెలుతురే" ఉంటుంది
..."అది నమ్మకం".

చుట్టూ కమ్ముకున్న
చిమ్మచీకటిలో కూర్చుని
చీకటిని తిట్టుకునే కన్న
"చిరుదీపం"
వెలిగించడం మిన్న
లేకున్న కాసింత ఓపిక
పట్టమని పెద్దలమాట.

కారణం ఖచ్చితంగా
రేపు "వేకువ" వస్తుంది
వెలుగుకిరణాలను తెస్తుంది
చిమ్మచీకటిని చీల్చివేస్తుంది.

చితికిన చీకటిజీవితాల్లో
"చిరుదివ్వెల్ని" వెలిగిస్తుంది
మోడువారిని బ్రతుకుల్ని
చిగురింపజేస్తుంది.

అప్పుడు
"వర్తమానం"
"వసంతభరితమే"
అది "ఆ భగవంతుని వరమే"...
"భవిష్యత్తు" సైతం
"బంగారుమయమే"...
"గతం" గందరగోళమైనా
గాఢాంధకారమైనా భయం లేదిక...
గుండెలోని ఆ గుప్పెడంత
ఆశే...ఔషధం......
ఆయుధం...అమృతం...ప్రతిమనిషికి....



-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## పుస్తక సమీక్ష

# అందరూ చదవాల్సిన పుస్తకం 'ఆలోచనా సులోచనాలు'






'ఆ ఆలోచనా సులోచనాలు' అన్నపేరు ఎంత బాగుందో అంత గొప్పగానూ పుస్తకంలోని రచనలు కూడా పసందుగా వున్నాయి. కూర చిదంబరం గారి వయస్సు ఎంతో నాకు తెలియదుగాని, ఎంతో అనుభవంవున్న, వయోవృద్ధులు తమ నిత్యజీవితంలో తారసపడిన సంఘటనలకు అక్షర రూపం ఇచ్చారా అనిపించింది. ఇది తన ప్రథమ ప్రయత్నం అన్నారుగానీ, రాసిన విధానం చూస్తుంటే రాయగలిగినవారు రాసినట్లుగా వుంది. వేములవాడకు చెందిన చిదంబరం, భీమకవి చాయలు కనిపించేలా రాసాడనే చెప్పుకోవాలి. తెలంగాణా నేటీవిటికి అద్దం పడుతూ ఈ ప్రాంతానికే సొంతమైన ఎన్నో పదాలను కూరవారు మనకు వడ్డించారు ఎంచగ్గా. మీరు రాసిన రాతలద్వారా ఆనాటి తెలంగాణా సంస్కృతీ. జీవన విధానం మనకు కళ్లకు కట్టినట్లుగా ముందుంటుంది. మావూరి జ్ఞాపకాలు అంటూ రాసినవన్నీ ఆ కోవకు చెందినవే. గ్రామీణ జీవితంలో కుర్రవాళ్లకు మిఠాయి దుకాణాలూ, చెరువులో ఈతలు, మార్కెట్లూ, మూలవాగు, దేవుడి గుళ్లు, నీతిపద్యాలూ, పాఠశాలలూ ముఖ్యంగా దైనందిన జీవితంతో ముడిపడివుంటాయి. వీటన్నింటి గురించి చెబుతూ, చిదంబరంగారు ప్రతి విషయంలోనూ తమదైన శైలిలో వాటిపై అభిప్రాయాలను భేషుగ్గా చెప్పారు. మావూరి జ్ఞాపకాలు అంటూ తమ స్మృతులను నెమరేసుకుంటూ, చివర్లో– 'నేటితరంవారు తమ బాల్యంలో ఏమి పొగొట్టుకుంటున్నారో తలుచుకుంటే గుండె బరువెక్కుతుంది' అంటారు.

'ఆనాటి వాగు అమ్మ. వాగునీరు అమ్మ స్తన్యంలాగా కమ్మగా వుండేది. వెచ్చగా గొంతులో దిగుతూ నరనరాన జీవంపోసేది. ఆవును చేరిన లేగదూడలా, పాలివ్వాలను కుని అడ్డాన వేసుకున్నబిడ్డకు లాగ మనసు బెంగలించేది. ఒక నది మనల్ని విడదీయటం లేదు, కలుపుతున్నాయి' అంటూ 'మూలవాగు'లో జీవ పరిణామం నీటిలో నుంచే పుట్టిందంటూ చెప్పడం బాగుంది.

నీతి పద్యాలను తల్లిదండ్రులూ, తాతమ్మలూ, నాన్నమ్మలు గాక పాఠశాలల్లో కూడా నేర్పించాలని పిలుపునిచ్చారు చిదంబరం. దేవుళ్ళకూ కష్టాలు, న్యాయ వ్యవస్థ గురించీ, పోలీసుల అత్యుత్సాహం గురించీ, అంతర్జాతీయ పెటెంటో రైట్ గురించీ, పన్ను ఎగవేత గురించీ, కండోంల వినియోగం గురించీ, నల్లధనం గురించీ, నేతల చేతల గురించీ రాసిన వ్యాసాలు ఆసక్తిదాయకంగా వున్నాయి.

ముఖ్యంగా చిదంబరంగారు వయోధికులకు ఇచ్చిన సూచనలూ, అవతార పురుషుడు శ్రీశ్రీశ్రీ భగవాన్ సత్యసాయి బాబావారి దర్శన సమయంలో కలిగిన మహత్తరమైన ఆధ్యాత్మిక అనుభవాలు ప్రశంసార్హంగా వున్నాయనడంలో ఏమాత్రం సందేహంలేదు. ఎన్ని విషయాలను ఈ పుస్తకంలో ప్రస్తావించారో మరి! అన్ని సంగతులూ అందరికీ ఉపయోగపడేవేమరి. మనం ఎంత అదృష్టవంతులం, తల్లిదండ్రుల పుణ్య ఫలితం, వేంకన్న ఆలయం, బ్రతుకంతా, ముందుచూపు, తానొకటి తలిస్తే వంటి వ్యాసాలు నేటి యువతరం కూడా చదవదగినవి. ఏకాగ్రత, వయోజనుల సమస్యలు అంటూ రాసిన వ్యాసాలు అలాంటివేమరి. ఈ పుస్తకంలోని కొన్ని వ్యాసాలు 'వాసవీ ప్రభ' అనే పత్రికలో ప్రచురితమై పలువురి ప్రశంసలనందుకున్నాయట.

అన్ పార్లమెంటరీ భాషను మన రాజకీయ నాయకులు ఒకరిమీద ఒకరు సంధించుకుంటున్న తీరును చిదంబరం గర్హించారు. దద్దమ్మ, చవట, సన్నాసి, తొత్తు, బట్టలిప్పికొడ్తా, నోరాముయిరా, సెప్టింక్ ట్యాంకు నోరును పినాయిల్‌తో కడుక్కో, కర్రు కాల్చిపెడతావంటివి సామాన్య జనం సిగ్గుపడేలా వున్నాయనీ, భాషా పరిరక్షణ అంటే ఇదేనేమో అని 'ఆమ్ ఆద్మీ' కన్‌ఫ్యూజ్ అవుతున్నాడంటారు.

తాను పుట్టిన వూరిలో ప్రారంభించి, జీవిత కాలంలో తారసపడిన ఎన్నో అనుభవాలనూ, సంఘటనలనూ అందంగానూ, ఆనందంగానూ తన తొలి ప్రయత్నంలో అందించిన కూర చిదంబరంగారి ప్రయత్నం సఫలీకృతం అయినట్లే. దేవరాజు మహరాజు, శ్రీరమణ వంటివారి ప్రశంసలందుకోగలగడం కూడా అదృష్టంగానే భావించాలి. చిదంబరంగారు మరిన్ని ఇలాంటి ప్రయోజనాత్మక ప్రబోధాత్మక రచనలు చేయాలని కోరుకుందాం.

**ప్రతులకు:** సౌమిత్రి ప్రచురణలు
6-1-118/19, పద్మారావ్‌నగర్
సికింద్రాబాద్– 500 025.
సెల్: 8639338675



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## వొడిసిపట్టాలే వానసినుకుల్ని

వాన సినుకులు
ఆకసంలకెల్లించి మేఘాన్నిడిసి
నేలను పలకరించాలని
సింగారంగా జారుతుంటే
గాలెట్లిస్తే గట్ల వొయ్యారంగా కుర్సవట్టే
నేలమ్మ నెర్రలన్ని ఇల్లలికినట్లు
సొగసుగా కొత్తపెండ్లికూతుర్లా
సిగ్గులొల్కబోస్తూ ముద్దుగయ్యింది
ఆకసాన్ని భూమమ్మను కలిపే
వంతెనలెక్క పెద్దమనసు వానది
నేలమ్మ దూపతీర్చే మనసు
వానసినుకులనొడిసివట్టి
నేలమ్మ
తన ఎదల నిలుపుకుంటది
తనపై బతుకెల్లదీస్తున్న
జీవులకంతా కడుపునింపుతది
వానది నేలది సోపతిప్పటిదా
భూమిబుట్టినప్పడిది
వానొచ్చి పలకరిస్తేనే భూతల్లి
పెయ్యంత పులకరిస్తది
నెమలోలే పచ్చదనంతో పురిచ్చుకుని
ఆకసంలున్న సింగడిలో
రంగులనన్నిటిని తన పైనిండా పులుముకుని
మనుసులకు పచ్చులకు
పాడి పంటలకు పానంబోస్తదిలే
సిన్నపిల్లలా గప్పుదేబుట్టినట్టు
బలే బాగుంటది నేలంతా
కష్టజీవులకందరికి కడదాకా ఆసరై
ఆశలను పండిచ్చిస్తది
వాన వొరుపులేకుండా కురుస్తే
వాగులల్లా వంకలల్లా సెర్లు గుంటలు నిండి
సంతసిస్తది నేలకువట్టిన మురికినంత తరిమేస్తది
చెల్కల సేతినిండుగ పని
కూలినాలి చేసెకునేటోల్లకు
కడుపునిండాల్నంటే
వాన రావాలి నేల తడవాలే.



-సి. శేఖర్(సియస్సార్)
9010480557

## నానీలు

అరిగే కొద్దీ సబ్బు
తరుగు
చదివే కొలదీ
విజ్ఞానం పెరుగు.

పూర్ణిమ రేయి
వెన్నెల హాయి
మది స్నానం
ఎవరికి ఇష్టం ఉండదు?

పండులో పురుగు
మనసులో కల్మషం
కనిపించని నేపథ్యం
మారాలిరా

మనం అసహ్యించుకున్నా
చెత్తకుండీకి ఆనందమే
శుభ్రతకు
కారణం అదే కదా!



-యలమర్తి అనూరాధ
9247260206

## భావి భారత మొలక

ఆత్మవిశ్వాసం కలిగి
అనుక్షణం మీ లక్ష్యాన్నే 'తలవండి'

మీకు జన్మనిచ్చిన
తల్లిదండ్రులను 'కొలవండి'

దారి చూపిన గురువులను
గౌరవంతో 'పిలవండి'

స్ఫూర్తి నింపే మాటల కోసం
వినయంతో 'కలవండి'

కష్ట సుఖాలలో తోడుంటూ
సాటి వారికి 'పలకండి'

మంచి దారిలో పయనిస్తూ
మీలోని చెడును 'పిలకండి'

ప్రగతి పథంలో వెళ్ళేటి
మీరే భావితరం 'మొలకండి'

సృజనకు పదును పెట్టి
మేధస్సును 'చిలకండి'



-చైతన్య భారతి పోతుల
7013264464

## ఆటపాటల చెలికాడు..

ముఖ కవలికలను బట్టి
మకరందం కురిపించాలా..
మనసు నేస్తమై మాట్లాడించాలా అనే
మనో వికాస విజ్ఞానియే
మన స్నేహితుడూ....
కన్నీళ్లు కార్చే కళ్ళకు
కాసిన్ని ధైర్య పదాలు
ఇంకిన్ని భరోసా వాక్యాలు
ఇంకించీ మనసు ఉల్లాస
పూలతోటను చేసేటోడు దోస్త్..
కష్టాల బురదను గుర్తించీ
నష్టాల గుంతలను పూడ్చే
ఇష్టుడే నాడూ నేడూ
గుర్తించదగ్గ రంగుల లోకమై
గుర్తింపు నిచ్చేటోడేగా మిత్రుడు..
ఆటపాటల చెలికాడు
పోటీల పల్లకిలో సహచరుడై
అనుభవ జ్ఞానానికి
అనుభూతుల ఆనందుడై
ఆరోగ్యాల ప్రదాతై
సంతోషాల హితైషే కదా
మన ఫ్రెండ్..



-కొక్కె రాములు
9985341992

## ఒక అపస్వర మూల్యం!

ప్రార్థనల నుండి ప్రార్థనలతో
రోజువారి దిన చర్యలన్నీ
ఆట పాటలతోనే మునిగితేలి
మురికి దేహాలతో గూళ్ళుచేరే పిల్లలు!

ఆకలేస్తే అమ్మతోనైనా దెబ్బలాడి
మొండికేసి తన్నులైనా తిని
సాధించుకునే పెంకి తనమైనా పోని
పసివాడని చిరు పువ్వులు!

నిప్పుకాలుతుందనీ
నీరుముంచుతుందనీ
లోకం అవినీతిమయమై
వర్ధిల్లుతున్నదని తెలియని వయసు!



ఏ పథకాలెందుకు పుట్టుకొస్తాయో
వాటి మూలాలెక్కడున్నాయో
లెక్కలు కట్టే కనీస స్పృహలేని
చిన్నారి అమాయకపు చిరునవ్వులు!

ఒక్కపూట భోజనం పెట్టి
ఒక అపస్వర మూల్యానికి
వందమంది పసిగుడ్డులను
మసిచేసుకునే విషాదంలో
ఎన్ని చేదుపాఠాలు దాగి ఉన్నాయో!

(కుంభకోణంలో పసి పిల్లల
మరణాలు వేసుతన్న ప్రశ్నలకు)



- సజ్జావెంకటేశ్వర్లు
9951169967

## స్నేహ గీతిక

ఉషోదయపు ఉషస్సులా
స్వార్ధ మెరుగని పవిత్రబంధం
హిమాలయ శిఖరపు యశస్సులా
ఈర్ష్య పడని అనుబంధం..!

పవిత్రమైన గంగా జలంలా
త్యాగనిరతికి ప్రతీక మైత్రిబంధం
స్వచ్ఛమైన మంచులా
అరమరకలు లేనిది స్నేహబంధం..!

కోకిల గానంలా, నెమలి నాట్యంలా
తేనే తీయదనములా, మానవతతో మెరిసేది

వయసుతో సంబంధం లేకుండా
పువ్వులాగ విరబూయునది
ఇప్పటికీ ఎప్పటికీ చెరిగిపోనిది
ఈ లోకంలో మహోన్నతమైనది..!

స్నేహపు మధురిమలు
జీవితాంతము నీడలా వెంటాడుతూ
మధుర భావాలను మీటి
మనసనే వీణను పులకింపజేస్తుంది..!

ముత్యపు చిప్పలో పడిన నీటిబిందువు ముత్యమైనట్లు
మంచిస్నేహితుడు సాంగత్యం దొరికితే
మనిషి ఉజ్వలంగా వెలుగుతాడు.!



-పిల్లి.హజరత్తయ్య,
9848606573

## చదువే నీకు వెలగమ్మా..




వందనమో వందనమో నా చెల్లల మంజుమ్మ
వందనమో వందనమో నా చెల్లెల దుర్గమ్మా
వందనమో వందనమో నా చెల్లెల సునీతమ్మా
కష్టజీవుల వందనమమ్మా కన్నతల్లుల వందనమమ్మా
బంధుమిత్రుల వందనమమ్మా కళాకారుల వందనమమ్మా.

చీరె సారెతో సాగనంపిరి సంసారానికి దారి చూపిరి
అత్తమామలతో గొడవలాయెనా భర్తకు నీకు విభేదమాయెను
మధ్యలో నీవు నలిగిపోతివా తల్లిదండ్రులను చేరుకుంటివా
నీ బాధలు యదలో దాచావే నా చెల్లల మంజమ్మా
నీ ఊపిరి ఉరికి బలియామే నా చెల్లెల మంజమ్మా.

ఆస్తిపాస్తికి కొదవలేదని అత్తకొడుకని యిచ్చి చేసిరా
మనసే లేని మనుషులమధ్య కష్టమే నీకు ఇష్టమాయెనా
బండెడు చాకిరి తీరికలేక ఆర్తనాదమును ఆలపిస్తివా
నీ రక్త పాశమే రాక్షసియై నా చెల్లెలా దుర్గమ్మా
నీ ప్రాణం వైరుకు వ్రేలాడే నా చెల్లెలా దుర్గమ్మా.

మురిపంగా నినుపెంచుకుంటిరి మంచి చదువని మెచ్చియిచ్చిరి
వందలు వేల లక్షలు కొలది కట్న కానుకలు హెచ్చుగా యిచ్చి
సంక్రాంతప్పుడు సగమైపోతివి ఉగాదినాటికి ఊడ్చుకుపోతివి
మమతా సమతలు మాయంటూ నా చెల్లెలా సునీతా
హీనుల మధ్య శవమైపోతివి నా చెల్లెలా సునీతా.

పంతాలొద్దు పట్టింపులొద్దు చిన్న వయస్సులో పెళ్లిళొద్దు
కష్టాలొద్దు కన్నీళొద్దు పెరిగే వయసులో పిల్లలువద్దు
ప్రేమలేని వ్యక్తుల మధ్య నరకయాతనకు బలికావద్దు
నీ చివరి మార్గము చావేనా నా చెల్లెల చంద్రమ్మా
చదువే నీకు వెలుగమ్మా నా చెల్లెల చంద్రమ్మా.

- బోయిన పెంచలయ్య

## అమృతమయం

కఠినాతికఠిన రాతి శిలల
బుగ్గలలో ఉబికిన జల స్వచ్ఛతలా
పాషాణ హృదిలో పెల్లుబికే ప్రేమ
కొలమానానికి చిక్కనంత
ఏ రూపంగానూ ఒడిసిపట్టలేనంత.

ఔను మరి
కరుడు గట్టిన కాఠిన్యతా గూటిలో
సుతి మెత్తదనపు పార్శ్వమే అపురూపం
హృదయం ద్రవించేంత ఘటనలు
కొండలని సైతం కరిగించే సంఘర్షణలే
అనూహ్యంగా ఎదురైనప్పుడు
గతమంతా ఓ కరిగిన శిల.

చిత్రంగా కాలగతిలో
బరువని తలచిన..
బాధ్యతలను వదలిన..
గుర్తెరిగిన బంధాలనూ వీడిన..
మానుష లక్షణ మర్యాదల్ని మరచిన..
తనదైన లోకపు తాదాత్మ్యతలో
విహరించిన..
విస్మృత జీవాలలోనూ
రాతిజల ధారల్లా
కనుల కొలనుల్లో చెమర్చిన
జీవధారల్ని స్పృశించే వెతుకులాట
నిజంగా ఓ అరుదైన దృశ్యమే
అమృతజలపాతమే.



-శ్రీదాస్యం లక్ష్మయ్య
9440155240

## అంటని నీటి బిందువులు



నిరసన తెరచిన కళ్ళు వెలిగినా
కాంతిమంటలు కాలాన్ని అలా నిలదీస్తుంటాయి
సమాజాన్ని సమాధానం యిమ్మని ఎదురు చూస్తుంటాయి
వుగ్గు తాగినప్పుడే నుగ్గయిన మానసం
సంఘం అణచివేతకి నిలువుటద్దమయితే
భావతటాకమున తటాలున
విరిసిన నిర్మల కమలాలకి గొడుగుపట్టాయి
కారుమొయిళ్ళు కమ్మిన మూఢాంధానికి కాంతిరేఖలై
నిశ్చల అవలోకనాలకి ఎదురుపడిన ఎదురుదెబ్బల్నీ
అక్కసుదృక్కుల్నీ జీర్ణించుకుంటూనే
తదేకలోకానికి పయనమయ్యాయి
కుంటి సాకుల్ని చూపుతూ కుంటుపడే
సంఘటిత చైతన్యాన్నే వెతుకుతూ
అలవాటుగా జనవాహినిలో కలిసిపోయాయి
తారుమారులు చుట్టూ తారాడుతున్నా..
తామరాకుని అంటని
నీటిబిందువులై హృదయానికి అద్దం పట్టాయి
ధీటుబాటకి గీటురాయి అయ్యాయి!
కలల మీద కలతలు పాకుతుంటే
కళ్ళల్లో మధ్యాహ్న సూరీళ్ళు
అవి వెతికే నిజాలే వూపిర్లు!!
సంఘమంటే హృదయాల్ని కలవడమే కదా!?
ఎవరిదారుల్ని వాళ్ళు తెంపుకుపోతే కలవడమెలా?!!
సమాజమంటే హృదయాలలోకి విస్తరించుకోవడమే కదా!
గూడుకట్టిన స్వార్థాలతోటి అణగారిపోతే
దుఃఖమయినా కట్టతెగదు సరికదా
వెలుగుధార ఆరిపోవడం అవశ్యంగా మారుతుంది!
దానిని సమాజమందామా?!
Society is Nothing but Web of Heart Beats
Bus not Rule and Devide!!

- బోజంకి వెంకటరవి
సెల్:

## జీవిత ప్రయాణం

జీవితపు ప్రయాణంలో
ఎన్నో మజీలీలు వస్తుంటాయి
వెళ్లిపోతుంటాయి
పువ్వులు విరబూస్తాయి
మనుషులు కలుస్తుంటారు.

శరదృతువు ఆగమనంతో
పూలు వాడిపోతాయి
ఒకసారి వాడిపోయిన పువ్వులు
మళ్లీ వసంతఋతువు ఆగమనంతో
తిరిగి వికసించవు

జీవితంలో కొందరు
విడిపోతుంటారు
వారు మళ్లీ కలవరు
జీవితాంతం
ఎదురు చూసినా మళ్లీ కలవరు

వారి జ్ఞాపకాలు
చిత్రవధ చేయకముందే
వారిని ఆపగలిగితే చాలు
వారు వెళ్లినాక
ఎన్ని సందేశాలు
పంపినా ఏమి లాభం

ఉదయం వస్తుంది
రాత్రి కరిగిపోతుంది
సమయం ఎవరికోసం
ఆగిపోదు
అందుకే
నీ అనుకున్న వారిని
విడిచిపోనివ్వకు
ఆ తరువాత
జీవితం ఉండదు.



-అరుణ డేనియల్
9000606889

## కలుపు తీయాలి....

ఇంటి ముందున్న ఏకొంచెం జాగనైనా
చదునుచేసి కొన్ని పూలమొక్కలు నాటి
పెంచి పోషించే ప్రయత్నం చేసిచూడు....

నాటిన ఆ మొక్కలతో పోటీపడి
పెట్టని పిచ్చిమొక్కలు పుట్టుకొచ్చి
మొలకలెదిగే క్రమంలో అడ్డుపడుతూ
చిందర వందర చిరాకు పుట్టిస్తాయి..

వాటి మొదళ్ళలో కలుపు తీసి పాదులుచేస్తే
ఆ మొక్కలు ఏపుగా ఎదిగి ఉల్లాసంగా
తలలూపుతూ ఒయ్యారాలు పోతాయి
మనసును దోచే రంగు రంగుల పూలను
బహుమతిగా ఇచ్చి ప్రాణం పంచుతాయి...

పెరిగే మొక్క తాను ఎదిగే ఒక్కొక్క దశలో
పుట్టుకొచ్చిన సవాళ్ళను ఎప్పటికప్పుడు
పద్ధతిగా మట్టుపెడుతూ చేయాలి చిరుసేద్యం...

అలాగే మది గదిలో గతితప్పి గందరగోళం
పుట్టిస్తున్న ఆలోచనల తేనెతుట్టెను ఒడిసిపట్టి
చేయాలి కూసింత కసరత్తు మదికదే నైవేద్యం....

ఏదీ దానంతటదే నీకు దాసోహం అయిపోదు
అదే ప్రకృతి నుండి నేర్చుకోవాల్సిన పాఠం
మనం చేసే పనిలో సత్ఫలితం పొందాలన్నా...
మన చింతనలో చిక్కులు తొలగిపోవాలన్నా...
పూలతోటలో అన్యజాతి పుట్టుకనుకట్టడి చేసినట్టే
మనోవనంలో చెత్తమొక్కల్లాంటి మకిలి యోచనల్ని
మునుంపెట్టి ఎప్పటికప్పుడు కలుపుతీయాలె...

హంస పాలు తాగినట్టు,నిండు కుండ తొనకనట్టు
మదిలో మెదిలే భావాలను ఒడిసిపట్టుకోవాలి
ఆలోచనల వరదవెల్లువకు ఆనకట్టకట్టి, అవసరం
మేరకే పారకం పెట్టాలి మంచికోసమే మల్లించాలి
గ్రహణం వీడిన సూర్యుడిలా ఆలోచనలపర్వం
స్వచ్ఛమై శుద్ధమై తేజోవంతంగా వెలిగిపోవాలి....

నిర్మల హృదయమే మనిషికి హుందాతనాన్నద్దేది
ఎప్పుడైనఎక్కడైన నిటారుగా నికార్సుగా ఉందాం
వంగిపోవడం తలదాచుకోవడం, కలతబురదలో
మునకలేయడం ఊపిరాడక గిలగిలా కొట్టుకోవడం
ముమ్మాటికీ అనవసరపు రాద్ధాంతమే కదా నేస్తం..!

ప్రకృతి కాంత తను కొత్త రాగం అందుకోవాలన్నా
ఆలోచనల వికాసం గెలుపు జండా ఎత్తుకోవాలన్నా
అటు పూల వనానికి ఇటు మనసులో మాయలకు
ఎప్పటికప్పుడు తప్పక చెయ్యాలి కలుపు నివారణ..



-మంచికట్ల లక్ష్మణ్
9494800112

## అమ్మ స్పర్శ



పొద్దు పొడిచింది
తీగలు లేని కిరణం
అమ్మ స్పర్శలా తాకింది
ఆకలి ఘోషకు
పాలవెలువై కురిసిన అమ్మ
ఇప్పుడు జ్ఞాపకాల చినుకులై తడుపుతోంది
నాగేటి చాళ్ళులో నాన్న
నాగలి కర్రుతో నల్లగి పాయలు దువ్వుతున్నప్పుడల్లా
నిశ్శబ్దాన్ని దున్నుకొస్తున్న నాకు
అమ్మ కొంగు ఊయలై నిద్రపుచ్చేది
వూడలులేని వృక్షంలా ఆ జ్ఞాపకాలు
నగరం నడిబొడ్డునా కుదుపుతున్నాయి
పలకా బలపం
అక్షరాలు నా చేత దిద్దిస్తున్నప్పుడు
ఆలమంద వచ్చేవేళ
మాతృత్వం కురిసిన చూపుల మేఘాలకు
వెన్నెల మొగ్గయింది ఈ హృదయం
జ్ఞాపకాలనది నెమ్మదిగా జారుతోంది
నా మార్కుల తేజస్సు
అమ్మ కళ్ళల్లో వెలుతురుగా చూసాను
ఎన్నిజ్ఞాపకాల పొరల అలలు
అక్షరం అడుగుల చప్పుడు చేస్తున్నప్పుడు
నా వెంట రాలేని తనాన్ని
దిగులు చూపుల కన్నీళ్ళుగా చిమ్మేది
పుస్తకాల ప్రపంచంలో విస్తరించినపుడు
సంధ్యవేళ వాలిన పిట్ట నా ఉత్తరం
అమ్మను ఆర్ద్రంగా హత్తుకునేది
అచ్చం నా జ్ఞాపకాలు
గాలివిసిరే సీతాకోక చిలుకలు
గూటికొచ్చిన గువ్వలు
తుట్టును చుట్టిన తేనెటీగలు
అమ్మ ఒడి నా కొక ధ్యానమందిరం
నేను పల్లెను వాటేసుకుంటానో
పల్లె నన్ను వాటేసుకుంటుందో
చిట్లిన అనుభవాల మీద
చినిగిపోని జ్ఞాపకాలు
మళ్ళీ అమ్మఒడికి లాక్కుపోతున్నాయి
చిలికే పూలతేనెతో–
ఎగరని తుమ్మెదలకు రెక్కలొస్తాయి
నేనూ అంతే– అమ్మ స్పర్శ కోసం
నగర సంద్రాల్ని విడిచీ– వేసవి నదిలా నీరసంగా
నీముందు వాల్తున్నానమ్మా
నీ స్పర్శ విజయానికి
ఒక ఆరంభ శబ్దం కదా!



-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

## మౌన రోదన

గర్భసంచీలో మొలకెత్తిన మనిషి
నవమాసాల కాలాన్ని మింగేసి
పురిటికేకతో
జీవితాన్ని ఆవిష్కరించుకొన్నప్పటి నుంచీ
స్మశాన విశ్రాంతి భవనంలో
దీర్ఘ నిద్ర కోసం ఊరేగింపబడే వరకు
మానవ జీవితం
రైతై భూమితల్లి గుండెల మీద
కన్నీటి చాళ్లను ఆవిష్కరిస్తే
పచ్చని పంటై పుట్టుకొస్తుంది
కార్మికుడై
భూగర్భ కుహరంలోకి కుక్కఒడి
ఆకలి మంటల బాంబులను పేల్చితే
నవ్వుకొంటూ నల్ల బంగారమై పుట్టుకొస్తుంది



ఈ చల్లని భూమితల్లి
పార, గడ్డపార, తట్టలను పిలిచి
ఒళ్లంతా గాయాలు చేసుకొని
చెఱువులై ఎండాకాలంలో
పశువులకు చలివేంద్రాలుగా
రూపాంతరం చెందుతుంది
తన గుండెలమీద గునపాలు దింపుకొని
ఇళ్లుగా మొలిచి నీడనిస్తుంది
శరీరంపైన
తాటిచెట్టు లోతుల మాంసం వొలిచేసినా
ప్రేమను నీటిగా మార్చి
అఖండ ప్రవాహమౌతుంది
తరతరాల సంస్కృతిని
తలపై మోస్తోన్న భూమితల్లి
నేడు
పాశ్చాత్య దుస్సంస్కృతీ ప్రభావానికి
మౌనంగా రోదిస్తోంది.



-తోకల రాజేశం
సెల్: 9676761415

## అమర భ్రమణం!



పురిటి నొప్పుల ఫలమై
సృష్టిలో దృష్టి సారించేందుకు
పంచభూత శాలలోకి
వినియోగదారునిగా నీవు విచ్చేయువేళ
మారుతుందది జన్మభూమిగా
అదృష్ట దురదృష్టాంచులపై
అనునిత్యం ఆశల కంచు నగారా మోగిస్తూ
జరుగుబాటు యాగాన్ని ఆదుర్దాగా ఆవిష్కరిస్తున్న వేళ
జ్ఞాప్తమౌతుంది కర్మభూమిగా
సేద్య ప్రతినిధుల క్రియాశీలత సాక్షిగా
ఉదర పోషణా పరాధారత సూక్తిగా
ప్రతిక్రియా కారకంగా మారుతున్న వేళ
ఆ రూపావర్తన రూపు సేద్యభూమి
ఆకాశం పై కప్పుగా గల నిరాశాశ్రితులకి
బ్రంహ్మాండాన్ని బాపుకోవాలనే అత్యాశీయుల
ఆకాంక్షకు
భూ బకాసురుల కబ్జా పేరాశకు
రగడపు జగడాలు రాజుకున్నవేళ
రక్తపు మడుగుల రూపు రణభూమి
ప్రకృతి సమతౌల్యం గతితప్పి
అదును ఆవర్తన చెందక
ప్రాణదీప ప్రాయోపవేశానికి కారణమైనవేళ
కనికరం లేని కళ వరంకాని కరువుభూమి
జవసత్తువలుడికిన జీవితోద్యోగపు జీవి
చరమాంకపు చివరి దశకు చేరిన వేళ
సమస్త కార్యాల సమయోచితానుగుణంగా
శరీరాన్ని తనలో కలుపుకుంటుందీ స్మశాన భూమి!

సర్వ జనీన సృష్టికి ఆధారమీధర
యుగ యుగాల చరితకు పార్వమీ పుడమి
సకల సుభా సుభాలకు నెలవీ నేల
ప్రభల సౌందర్య సోభకు విడిదీ వసుధ
మహా సంగ్రామాలకు ముఖ్య భూమిక ఈ భూమి
సదా సంచలనాల సారధీ పృధ్వీ
లిప్తపాటు ఆప్తమొదలని మైత్రి అవని
ఎల్లరనూ అడుగుతోంది ఇదేమిటని.

– మైత్రేయ
సపెన:

## స్నేహం

కులము మతము లేక కుటిలము యెరుగక
కలిమి లేములనక చెలిమి సాగు
ఒంటరి బతుకునకు వోదార్పు నిచ్చే ది
నిన్ను నిన్నుగానె నిలుపునెపుడు !

మంచి మనసు తోడ మహిన నిలిచినది స్నేహమెపుడు
మనకు సేద తీర్చు
ఆపద యనినంతె యాదుకొను చెలిమి
వయసు పెరుగు కొలది వన్నె పెరుగు !

చిట్టి మనసులోన చిరు దీపమై వెల్గి
బతుకు సమర మందు బాట వేసి
చక్కనైన చెలిమి చల్లగా వర్ధిల్లు
మంచి మైత్రి నెపుడు మరువరాదు !

స్వార్ధమంటు లేని సఖ్యత చెలిమిది
మాట మీద వుండి మనల నడుపు
కోపమంటు లేక కోరినదిచ్చును
నమ్మకమ్ము మీద నడుచు మైత్రి !

మధురముగను వుండు మన బాల్యమెప్పుడు
మరిచిపోని గుర్తు మంచి చెలిమి
చిన్నతనము లోన చిలిపి గుర్తై నిల్చు
నేస్తమెపుడు నిలుచు నీడలాగ



-సునీత బండారు
9440671530

## మిగిలేదెవరు?

ఆత్మహత్య ఒక పాపపుచర్య
ఆ అధికారం ఎవరిచ్చినారయ్య
సమస్యలు రానివారెవరు
ఆటుపోట్లు లేకుంటే జీవితంలో మాధుర్యంలేదు
సముద్రంలో కెరటాలు వస్తుంటాయ్ పోతుంటాయ్
అదే కడలికి ఆనందం
సమస్యలు వస్తుంటాయ్ పోతుంటాయ్
కాని ప్రాణంపోతే తిరిగిరాదు
సమస్య లేనివారెవరు
చావాలనుకునేవారెందరు
బ్రతుకులో సుఖంలేదని
బ్రతికే స్తోమత లేదని,
కుటుంబం భారమని
అనుకున్నది వికటించిందని,
అన్నదమ్ములు విడిపోగా
చేరదీయువారులేక
కన్నకడుపు రగిలిపోగా
పేగుబంధాన్ని ఒకటి చేయలేక
చావాలనుకునే కన్నవారు
మరొకరు చాలీ చాలని బ్రతుకులని
సంసారం యెలా ఈదాలని
పిల్లలకు విషమిచ్చి తాముతీసుకునేవారు,
మరొకరు ప్రేమ ఫలించలేదని
పెద్దలు ఒప్పుకోలేదని ఆత్మహత్య చేసుకునేవాళ్ళు
మరొకరు ఇంట్లో వివాదాలకులోనై
ఎవరికి చెప్పకుండ నుయ్యో గొయ్యో చూసుకునేవాళ్ళు
చావడానికి ఇన్ని దారులున్నప్పుడు బ్రతకడానికి
దారులుండవచ్చుగదా
ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది
ప్రయత్నిస్తే దారి దొరకకపోదు
కష్టమైనా చివరకు గెలుపు నిన్నే వరిస్తుంది.
సమస్యలున్నాయని ప్రతిమనిషి చావాలనుకుంటే
భూమ్మీద మిగిలేదెవరు?



**-ఎలగందుల లింబాద్రి**
చరవాణి. 7659834393.

## ఒరే మనిషి...

మతం ముసుగులో మారణహోమం చేస్తూ
దాని అభిమతం జనహింత
అసలు తత్వం మానవత్వం అని మరిచి
స్వేచ్ఛా జీవికి మత్తెక్కించి
మకిలి పట్టించి,గీతలు గీసింది నువ్వే కదా.

స్వార్థంతో పూటకో రంగు అద్దుకొని
మాటలతో మలుపుకుని
మతమాజ్యం పోసి లేని నిప్పు
రగిలించి ఓట్లు దండుకుంటూ...

లేని పోని సరిహద్దు కంచెలు నాటి
ఉగ్రవాది లోకాన తూటాల వర్షం కురిపించి
రక్తపుటేరులు పారించింది నువ్వే కదరా...
ఒరే మనిషి మరి ఆ దేవునికి
ఎందుకు అంటించి అపవిత్రం చేస్తావురా...

ఎర్రగా ఉదయించే సూర్యుడు
చల్లని వెన్నెల, పంచభూతాలు సైతం
నీలాగే అనుకుంటే
సకలచరచర జీవకోటి మనుగడ
సాధ్యమేనారా ఒరే మనిషి.

అందుకే గరళాన్ని వదిలి పలుకు సరళం
మనుషులంతా ఒక్కటే,సారమంతా స్వచ్ఛతే
అని గురుతర బాధ్యత ఎరిగి
మతసామరస్యమే జీవన విధానమని
విశ్వమంతా చాటి చెప్పాలి.



**-శ్రీతరం బింగి శ్రీకాంత్**
7893613015

## అంతరాత్మ

నాలోని ఆవేశమే నా బలం
నన్నేరోజు దిగజారనివ్వలేదు
నాలోని ఆలోచనలకు
పదును పెడుతుంది
నాకేరోజు సంతోషమనిపించదు
నిజాన్ని అబద్ధం చేస్తానంటే
న్యాయాన్ని అన్యాయం చేస్తానంటే.

అదృష్టమంటే నమ్మను నేను
కష్టే ఫలిగా జీవిస్తాను
అవకాశవాదులకు ఆసరా కాబోను నేను
అమాయకుల గొంతవుతాను
ద్రోహమంటే నచ్చదు నాకు
స్నేహమంటే ప్రాణమిస్తాను

గుండె ధైర్యమెక్కువ నాకు
గ్రూపులు కట్టడం రాదసలు
సేవా తాత్పరుడిని నేను
పలకరిస్తానందరిని చిరునవ్వుతో
అసహనమంటు వుండదు నాలో
ఊపిరి ఉన్నంత వరకు
జాతి బాగుకై పోరాటం చేస్తాను నేను

మానవతావాదిని నేను
ఏ మతం నన్నాపలేదు
స్వార్థపూరిత ఆలోచనలు రావసలు నాకు
పరోపకారమంటే
ఇష్ట పడతాను నేను
కులమంటే చీదరింపు నాకు
జాగ్రత్త పడాలి మీరు
కుల ప్రస్తావన తెచ్చే ముందు

ప్రతి స్త్రీలో అమ్మని చూస్తాను నేను
మహిళలను అవమానించినోడికి
సరైన గుణపాఠం నేర్పుతాను
జీవితాంతం గుర్తుండేలా

ఇది నా కథ కానే కాదు
మనుషులంతా ఒక్కటేనని
మసకబారిన కనులు తెరుచుకోవాలని
విశ్వమంతా
సోదర భావంతో మెలగాలని
ప్రేమ కంటే గొప్పది మరేది లేదని
ప్రతీ వ్యక్తి ఆలోచించాలి...!



**-ఎన్.పవన్ కుమార్**
9989237142

## ఇక చాలు అంతరించవే..

రోజు రోజుకు కోవిడ్
కొంచెం కొంచెం
కొట్టుమిట్టాడుతూ
జీవిడుస్తుందనుకుంటే
జవసత్వాలు నింపుకొని
అన్నార్థుల పాలిట
అభాగ్య రేఖలు గీసి
సౌభాగ్యం లేని రోదనే
సూపించే కాలకూట కరోనా
ఇక చాలు చావవే...

అక్కడెక్కడో పుట్టి
ఇక్కడొచ్చి ఇక్కడున్నోళ్లకు
ఇక్కట్ల నిప్పును రాజేస్తూ
సామాన్యుల గుండెలను
సొమ్మసిల్లేలా జేసి
కిమ్మనకుండా లోలోననే
వికృత తాండవం జేస్తున్న
వికార కురూప కరోనా
ఆకారమే సరిగ్గా లేని నీవు
ఇక చాలు చచ్చుబడిపోవే..

ఉన్న సమస్యల చలితో
వణికిపోతుంటే.. నీ
మొదునాష్టపు పంజాతో
మోడులా గుల్లబార్చి ఏం
మోసుకపోతావు మహమ్మారి..
నసపెట్టకా.. నష్టం జేయకా..
నశించిపోవే పురుగా...
ఇక చాలు అంతరించవే..



**-కొక్కె రాములు**
9985341992

## జర భద్రం కొడుకో

అమాయకతో అజ్ఞానమో
అహంకారమో అర్థం కాదు
అన్నీమరిచి అంతామామూలైనట్టు
రాకాసి విషప్పురుగు కాటేసేలా
బలిపశువులై బలాదూర్ గా
జనం తిరుగుతూ కనిపించటం వింతే

నిన్నటిదాకాప్రపంచాన్ని కుదిపేసిన
మహమ్మారి బారినపడి
దిక్కుతోచక జనమంతా
మృత్యు భయంతో స్వంత
ఇంటి జైలులో స్వయంఖైదీలై
బిగపట్టుకున్న ప్రాణాలతో
ఏడాది కాలం అజ్ఞాతులై ఉన్నాం

భౌతిక దూరాలు, మాస్క్ లు
పరిశుభ్రతల జాగ్రత్తలతో
మనుషులం చావు కౌగిలినుండి
తప్పించుకుని మిగిలిన వాళ్ళం

సహజ రోగ నిరోధకత వల్లనో
వాక్సిన్ అపర సంజీవిని
అందుబాటులోకి వచ్చిందనో
లేనిధైర్యంతో స్వేచ్ఛగా తిరుగుతూ
జాగ్రత్తలకు తిలోదకాల్నిచ్చి
కబలించ దాగిఉన్న కరోనాను
కౌగిలించుకోబోతున్న జనాలకు
మారిన కొత్త రూపంలో
సెకండ్ వేవ్ పేరిట అంతటా

విజృంభిస్తున్న అంటువ్యాధికి
అన్యాయంగా ఆహుతి కావొద్దని
జాగ్రత్తలే జీవనవిధానం కావాలని
వాక్సిన్ ప్రతి మనిషికి చేరేదాకా
ఈ రక్షణ తంత్రాలు సాగించాలని
భద్రంకొడుకో మాట మరవొద్దని
హెచ్చరించడం అనివార్యమైంది.

(కరోనా పాజిటివ్ కేసులు తిరిగి పెరుగుతున్న వార్త నేపథ్యంలో)



**-డా.కె.దివాకరా చారి**
9391018972

## సు'జల'యజ్ఞం

జలాన్ని కలుషితం చేసి
జీవి కంఠంలో గరళాన్ని నింపొద్దు
మితిమీరిన నీటిని వృధాచేసి
ధరణికి కన్నీటి వ్యథను మిగల్చొద్దు
గొట్టాలతో భూగర్భ జలాన్ని తోడి
పుడమికి గర్భశోకం కలిగించొద్దు
వర్షానిచ్చే పచ్చని చెట్లను నరికి
కరువు రక్కసికి బలి కావద్దు
భవితకు భద్రత కలగాలంటే

నీటిబిందువు ఆత్మబంధువు కావాలి
జీవనయానం సాగాలంటే
నీటిచుక్కను చక్కగా పొదుపు చేయాలి
రేపటి తరం నిత్యం వెలగాలంటే
నీటి బొట్టు ఆయువుపట్టు కావాలి
ఇకనైనా విజ్ఞతతో మేల్కొందాం
నీటివనరుల సంరక్షణకు పూనుకుందాం
సు'జల' యజ్ఞానికి నిమగ్నమవుదాం



**-కయ్యూరు బాలసుబ్రమణ్యం**
9441791239

## చీకట్లో రాసిన రాతలు

నీ రాతలన్నీ చీకట్లో రాసినవే
తాడుంటే బొంగరం ఉండదు..
బొంగరం ఉంటే తాడూ ఉండదు.
ఇక జీవితంలో తిరగడం ఎక్కడిది.
రాతలే కాదండోయ్..
జీవితము చీకటే.
వెలుగులను పంచె కిరణాలని కూడా
వెనక్కి లాగేసు కుంటున్నారు.
అంధకారంలోకి నెట్టేస్తున్నారు.
నోట్లోకి వెళ్లే నాలుగు మెతుకులను
కూడా రాకుండా చేస్తున్నారు.
నీమీద రాబందుల్లా పడి దోచుకొని
బకాసురుల్లా బలిసిపోయి
తరతరాలకు ఆస్తుల్ని కూడబెడుతున్నారు.
చేయనివ్వండి ఎంతకాలం చేస్తారో
చేయనివ్వండి.
నీకేమో దోచుకోవడం రాదు..
పొద్దస్తమానం శ్రమించడం తప్ప..
నీకేమో ప్రశ్నించడం రాదు...
నమ్ముకున్న నేలతల్లి నుండి
సిరుల పంట పండించడం తప్ప.
నీకేమో శ్రమ దోపిడీ చేయడం రాదు.
నీ శ్రమనే ఇంకొకరు దోచుకుంటారే తప్ప.
నీ రెక్కల కష్టాన్ని ఆసరాగా చేసుకుని
అంచెలంచెలుగా ఎదుగుతున్నారే తప్ప
అతుకులు పడ్డ నీ బతుకును
అక్కున చేర్చుకునే వారే కరువాయే.
దోచుకోవడం దాచుకోవడంతెలియనివాడివి.
అందుకే నీ రాతలన్నీ చీకట్లో రాసినవే.
నీ జీవితం అంతా చికటే.
స్వల్ప గాలివానకే రాలిపోయేబతుకులు నీవి.
కంటి నుండి కారుతున్న కన్నీరుపై
పడవ ప్రయాణం చేస్తున్నావు.
నయవంచకుల జమాన ఇది.
జర జాగ్రత్త సుమా....
బతుకుపోరులో బయపడకు.
నీ నమ్మకం అనే అంచుల శిఖరాల
మీద అడుగు తడబడకుండా నడువు.
ఎదో ఒకరోజు నీ గమ్యాన్ని
ముద్దాడుతావు లే.....



**-అశోక్ గోనె**
9441317361

# పుష్పక విమానం

(కథ)

రాజ్యలక్ష్మమ్మగారు హడావుడిగా అటు నౌకర్లకు పనులు చెబుతూ,ఇటు తాపీ మేస్త్రీలను, హెచ్చరిస్తూనే కూలీలతో ఇంటి ముందు మొలచిన గడ్డిని, పిచ్చి మొక్కలను అన్ని తీసేసి శుభ్రంచేయమని చెబుతున్నది.

రాజారావుగారు ముచ్చటగా కట్టుకున్న ప్యాలెస్ వంటి ఇల్లు అది. పట్టణానికి కూతవేటు దూరంలో తన పొలాల మధ్య ఆ కాలంలోనే... అంటే దాదాపు 70సంవత్సరాల క్రిందనే రెండు అంతస్తులు ( భూగృహం) నేలమాళిగతో ఉన్న ఇల్లు అది. దాదాపు 10 లేదా 12 మెట్లు ఎక్కితే కానీ వరండా చేరుకోము.... అంత ఎత్తున ఉన్న ఆ ఇల్లు అర్ధచంద్రాకారంలో చూడగానే ఆహా! అనిపించేటట్టుగా ఉంటుంది. మెట్లెక్కి వరండా దాటగానే విశాలమైన హాలు, ఆ హాలుకు అటు ఇటు గదులు... పేరుకే అవి గదులు అవి కూడా దాదాపు హాల్ అంత వైశాల్యమే ఉంటుంది. కుడివైపు గదిలో నుండి నేలమాళిగకు మెట్లు ఉన్నాయి. హాలు దాటిన తర్వాత మేడపైకి వెళ్లే మెట్లున్న గది, అది దాటితే విశాలమైన భోజనశాల, దానికి ఆనుకొని దేవుని గది, పచ్చళ్ళ గది, వంటశాల, దాని పక్కనే సామాను భద్రపరిచే కొట్టిడీ ( స్టోర్ రూమ్) దాని పక్కనే చాయలు, కాఫీలు పాలు కాచుకోవడానికి ఇంకొక గది ఉంటుంది. వీటిని ఆనుకొని విశాలమైన లోపెరడు.. అందులో వంటకు వాడడానికి ప్రత్యేకమైన బావి, కుడివైపున స్నానాల గదులు, ఆ పక్కనే పశువుల కొట్టాలు ఇలా ఉంటుందా ఇల్లు...

ఇన్ని సంవత్సరాలుగా పిల్లలు చదువుకొని విదేశాలలో పనులు చేస్తున్నారు. ఆ ఊర్లో అంత పెద్ద ఇంట్లో ఉండలేక రాజారావు గారు ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మ పక్క పట్టణంలోనే స్వంత ఇంట్లో ఉంటున్నారు. అదీకాక ఆ పల్లెటూర్లో వైద్యసదుపాయం కూడా అంతంత మాత్రమే.

అటకమీదనుండి ఇత్తడి గంగాళాలు, గుండిగలు, నీళ్ళు కాచే కొప్పెరలు, తోడు కునేందుకు చట్టి, డేక్సాలు అన్ని దింపించింది లక్ష్మమ్మ. అప్పుడే అక్కడికి వచ్చిన రాజారావు " నీ పిచ్చి గానీ! నీ మనుమలు, నీ కోడలు -కొడుకులకు బాత్ టబ్లో స్నానం చేసే అలవాటు... ఇలా రెండు కిలోల బరువున్న ఇత్తడి చెంబు ఎత్తి స్నానం చేయగలరా? నీ చాదస్తం రోజురోజుకు శృతిమించినట్టున్నది. ఇంటి ముందు ఆ మెట్ల దగ్గర ఆ గంగాళం ఏమిటి? అక్కడ ఆ మరచెంబు ఏమిటి?

అనగానే ఇంట్లోకి వచ్చే ముందు ఎవరైనా కాళ్ళు కడుక్కొని రావడం మన సంప్రదాయం. దాని ప్రకారం ఏర్పాటు చేశాను. కానీ అయితే ఏం? పిల్లలకు మనం చెప్పకుంటే మన ఆచారాలు, పద్ధతులు ఎలా తెలుస్తాయి? నేను చేసే ప్రతి పనికీ అడ్డుకట్ట వేస్తూ మాట్లాడటం మీకు అలవాటు... అని విసుక్కుంటూ... పనమ్మాయితో ఆ దీపపు సెమ్మె చాలా నల్లగా అయిందే! అది మా అత్తగారి అత్తగారి కాలం నాటిది.... కాస్త ఉప్పు చింతపండు వేసి గట్టిగా తోమి, ధగధగలాడేట్టు చేయవే! అని పురమాయించి, స్నానాల గదిలో ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని చూసేందుకు వచ్చింది.

ఆ కాలంలోనూ స్నానాల గది ఏర్పాటు చూస్తే ఆ సాంకేతికతకు ముచ్చటేస్తుంది. ఎలా అంటే ఇవతల బావి నుండి చేద బొక్కెనతో నీళ్లుతోడి, స్నానాల గది గోడకున్న చిన్నకిటికీ లాంటి దానిలో పోస్తే... నేరుగా వెళ్లి స్నానపు గదిలోపల ఉన్న తొట్టెలో పడే ఏర్పాటు అది.. మనిషి చుట్టూ తిరిగి వెళ్లనక్కర్లేకుండానే శ్రమ తగ్గిస్తూ నీటి తొట్టి నింపే ఆలోచన ఆ కాలంలోనే రావడం ఎంత బాగుందో!!! ఇదిచూసి, తన మనవడు తప్పక ఆశ్చర్యపోతాడు అనుకుంటూ వంటింట్లోకి వచ్చింది.

అక్కడ కట్టెలతో వంట చేసే పద్ధతిలో కట్టెల పొయ్యి ఉంది. ఈ కాలంలో వంట కట్టెల పొయ్యి మీద ఎవరు చేస్తున్నారు? దీన్ని తవ్వించేయాలి అని అనుకొని, వద్దులే ఉండనీ... ఈతరం వాళ్లు ఆ కాలంలో ఎంత శ్రమపడి వంటలు చేసే వాళ్లమో చూస్తారు... అనుకుంటూ ఒక మూల గట్టు ఏర్పాటుచేసి గ్యాస్ పొయ్యి అమరిస్తే సరిపోతుంది అనుకొని, తాపి మేస్త్రీలకు ఆ పని అప్పగించి, పడకగదిలోకి వచ్చింది.

ఎత్తయిన పెద్ద పందిరిమంచం. దానికి చుట్టూ కర్రలతో దోమతెర కట్టుకునే సదుపాయం, మంచి బూరుగు దూదితో కుట్టిన పరుపులు,మెత్తని దిండ్లు ఉన్నాయి. గదిని సంతృప్తిగా చూసి వాటి మీద పక్క బట్టలు మార్చమని చెప్పి, ఆ పక్కనే పెద్ద చెక్కపెట్టె నుండి ,బెడ్ సీట్లు తీసి మంచం మీద పెట్టి అక్కడ నుండి పిల్లల గదిలోకి వెళ్ళింది.

అంతగా ఎత్తు ఎక్కువ లేని నల్లమద్ది చెక్కతో నగిషీ పనితో చెక్కిన మంచాలు చాలా అందంగా ఉండి, పిల్లల బాల్యమంతా గుర్తుకు వస్తున్నది... ఈ మంచం నుండి ఆ మంచం మీదకి ఆ మంచం మీద నుండి ఈ మంచం మీదకి ఎగురుతూ దుముకుతూ వాళ్ల నాన్న కోప్పడగానే కాసేపు ఎగరడం మానేసి, ఆయన అటు వెళ్లగానే మళ్లీ అలాగే అల్లరి చేస్తూ కింద పడి దెబ్బ తాకించుకుంటే పసుపో లేదా టించరో దూది కంటించి,దెబ్బ తాకిన చోట పెట్టి,వాళ్లను సముదాయించి, కథలు చెప్పి, పాటలు పాడిన ఆ దృశ్యమే మాటిమాటికి గుర్తుకు వస్తున్నది. అర్ధరాత్రి పిల్లలు తమ పక్కలు తడుపుకుని, వచ్చి తమగదిలో మా మధ్యన పడుకునేవారు... పిల్లల చదువులు హడావుడీలు, వాళ్లదే లోకంగా 25 సంవత్సరాలు గిర్రున తిరిగిపోయాయి.

పిల్లలకు ఉద్యోగాలు వచ్చినప్పటి నుండి ఒంటరి జీవితమే! ఎన్నో రాత్రులు నిద్ర లేకుండా గడిపాం. ఎంత మానసిక క్షోభ అనుభవించామో? పిల్లల అభివృద్ధికి తన మాతృ మమకారం అడ్డు రాకూడదని బాధను పంటికిందనే నొక్కి పట్టింది.

రాజారావు గారు ఊరి వ్యవహారం, పొలం పనులు వాటితో ఆయనకు క్షణం తీరిక ఉండదు.రాజ్యలక్ష్మమ్మకు పూజలు, పుస్తక పఠనంతోనే గడిచిపోతుంది.. కాస్త వెసులుబాటు ఉంటే రేడియో వింటుంది అంతే...

ఇన్ని రోజులకు ఈ మహమ్మారి కరోనా ప్రపంచాన్ని అతలాకుతలం చేసినా... తను పిల్లల దగ్గరికి వెళ్లలేక పిల్లలు తన దగ్గరికి రాలేక మానసిక వ్యధను పొందింది...

ఆలోచనలలో నుంచి బయట పడి పనులు ఎంత వరకు వచ్చాయని చూడడానికి వచ్చేసరికి, ఇంటికి సున్నం వేయడానికి వచ్చిన అతను అమ్మగారూ! ఇంట్లో ఎవరిదైనా పెళ్లి ఉందా? అని అడిగాడు.

పెళ్లి ఏంలేదు... కానీ ప్రతి గదికి సున్నం రెండు విడతలు వెయ్యమని పురమాయించి, ఇంటి వెనుక శుభ్రం చేశారా? లేదా అని చూడడానికి వెళ్ళింది.

గోడ ఎత్తు తక్కువగా ఉండటంతో ఇంటి వెనక ఇంట్లో ఉన్న పూజారిగారి భార్య" వదినా! ఏమిటి చాలా హడావిడిగా ఉన్నారు? ఏమిటి విశేషం?" అని అడిగింది

నేనే వచ్చి చెప్పాలనుకున్నాను వదినా! అసలు పని తీరక రావడానికి కుదరలేదు... మన ఊరి కోదండరాముని దయవలన మా అబ్బాయి ఆలోచనలో మార్పు వచ్చింది. నాలుగు నెలలు లాక్ డౌన్ లో ఉండడం, కరోనా ఆ దేశాన్ని కకావికలం చేయడం, మేము ఇక్కడా...వాడు వాడి కుటుంబ అక్కడా... ఉండి మానసిక వేదన అనుభవించాం! ఇక పెద్దవాళ్ళు ఆ దేశం వెళ్లడం కూడా కష్టం అనుకున్నాడో ఏమో? తాను చదివిన అగ్రికల్చర్ బీఎస్సీ పరిజ్ఞానంతో తన పొలాలు వ్యవసాయం, చూసుకొంటూ, మాతో కలిసి ఉండాలని కుటుంబంతో సహా వస్తున్నాడు. అక్కడేమో చాలా పెద్ద పెద్ద ఇండ్లు, విశాలమైన ఖాళీ స్థలాలు అలా జీవించడం అలవాటు పడ్డ వాడు బస్తీలో ఉండలేదని, అందులో మన ఊరు కూడా పట్టణానికి దగ్గరే ఉండటంతో ఇక్కడే ఉండి, పట్టణ కాలుష్యానికి దూరంగా ఉంటానన్నాడు. వాళ్ల స్థాయిలో పరిశుభ్రత మనం అందించక పోయినా, నా చేతనైనంత వరకు పరిసరాలు ,ఇల్లు అంతా శుభ్రం చేయిస్తున్నాను... అని అన్నది రాజ్యలక్ష్మమ్మ.

ఇంతలో వెనుక నుండి రాజారావు ఆ... ఏం శుభ్రత? అక్కరకు వచ్చింది అక్కడ... మహమ్మారి ఆ దేశంలోనే ఎక్కువ విజృంభించింది... మన దేశంలో పరిశుభ్రత తక్కువే ఉన్నా దాని ప్రభావం తక్కువగానే ఉంది అంటూ... శుభ్రం ...శుభ్రం.. అంటూ గిలక వలె ఆ గది నుండి ఈ గదికి ఈ గది నుండి పెరట్లోకి తిరగడమేనా? తిండి తిప్పలు ఏమైనా ఉన్నాయా? అని చిరుకోపం అభినయిస్తూ అన్నారు...

మీకేం? అలానే అంటారు... ఇంక వారం కూడా లేదు పిల్లలు రావడానికి... వాళ్లు వచ్చేసరికే అన్ని పనులు ముగించుకొని కరువుతీరా పిల్లలతో ముచ్చట్లు పెట్టాలి అన్నది రాజ్యలక్ష్మమ్మ...

అయితే ఇంగ్లీష్ టీచర్ ని ఇంటికి రమ్మని చెప్పనా? అన్నాడు రాజారావు...

ఇంగ్లీష్ టీచరా ? ఆయన ఎందుకు? అన్నది లక్ష్మమ్మ...

మరి నీ మనవడు, మనవరాలుతో మాట్లాడాలంటే నీకు ఇంగ్లీష్ రావద్దా? పిల్లలకు తెలుగు రాదు కదా! అన్నారు రాజారావు.

ఏం అక్కర్లేదు.. మాకు ప్రేమ భాష వచ్చును.. దానితో ఎన్నయినా కబుర్లు చెప్పుకోవచ్చు అన్నది లక్ష్మమ్మ సంతోషంగా...

ఇన్ని రోజులు ఇంత పెద్ద ఇల్లు ఇలా మూల పడిపోవాల్సిందేనా? అని ఎంతో బాధపడ్డాను... ఎవరు ఉండరా! అని బాధ పడుతున్న సమయంలో వీడియో కాల్ లో మనవడు ఏమన్నాడంటే... ఇన్ని సంవత్సరాలు అమెరికా లైఫ్ చూసాం... ఇక మన ఊరు మన దేశంలో ఎంజాయ్ చేయాలని అనుకుంటున్నాము... అంతేకాదు ఎరువులు వాడకుండా ఆర్గానిక్ పంటలు పండించి, మనం తినడమే కాదు అందరికీ సరఫరా చేయాలని, అందరికీ మంచి ఆహారపు అలవాట్లు చేయాలని, అది అవసరమని ఇంకా ఏదో చెప్తుంటే... మనం వారం రోజులలో అక్కడ ఉంటాం... అన్నీ నేరుగా మాట్లాడుకోవచ్చు.. నాయనమ్మకు చాలా రాత్రయింది అంటూ అమ్మా! విశ్రాంతి తీసుకో అన్నాడు బాబు కొడుకును మందలిస్తూ...

వాడు వెళ్లేటప్పుడు నేను అన్నాను కూడా... ఒరేయ్ నాన్నా! నువ్వు చదివింది కూడా వ్యవసాయానికి సంబంధించిన చదివే కదా! మనకూ పొలాలు ఉన్నాయ్! అక్కడికి వెళ్లి గది గోడల మధ్య కంప్యూటర్ లో ఆరోగ్యకరమైన పంటలు ఎలా పండించాలని పరిశోధన చేయడంకన్నా... మీ నాన్న గారితో పాటు రోజూ మన పొలానికి వెళ్లి, క్షేత్రస్థాయిలో మంచి పంటలు పండించవచ్చు కదా! అని అంటే... అందరూ అమెరికా వెళుతున్నారు.. నేను వెళ్లాలని ఇతరులను చూసి, పరుగుపందెంలో పడ్డాడే తప్ప వాస్తవం ఆలోచించక అలా వెళ్ళి పోయి, కనీసం ఇన్ని రోజులకైనా ఆ ఆలోచన రావడం సంతోషం. అందరూ కంప్యూటర్ పని చేస్తే... కడుపు నింపేదెవరటా? ఏం? వ్యవసాయంలో బతికే వారు లేరా? ఇదేమైనా పరువు తక్కువ పనా? అనుకుంటూ ఇప్పటికైనా ఎంత మంచి నిర్ణయం తీసుకున్నాడు బాబు! చాలా సంతోషంగా ఉంది... వీళ్లకు ఉన్న తెలివితేటలతో మంచి ఆహార పంటలు పండించడమే కాకుండా, పదిమందికి జీవనభృతి కలిగించడమే కాదు ఈ ముసలి వయసులో పిల్లలతో కలిసి ఉండడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది...

ఇన్ని రోజులు ఈ కరోనా మహమ్మారిని ఎన్నో సార్లు తిట్టుకున్నాను.కానీ ఇంత మార్పు పిల్లలలో దీనివలననే కలగడం, దాని విలయతాండవం చూసే కావచ్చు అనుకుంటున్నాను.. ఏదైతేనేం...?

రత్నగర్భ నా దేశం! పుష్పక విమానం నా దేశం! ఎంతమందికైనా తన బిడ్డలకు ఆశ్రయం ఇస్తుంది. ఆకలి తీరుస్తుంది... ఉన్నదాంట్లో కలిసి బ్రతకమని ఉద్బోధ చేస్తుంది నా సంస్కృతి... ఈ దేశ సంస్కృతి కుటుంబానికి పెద్ద పీట వేస్తుంది... ప్రపంచానికి పాఠాలు నేర్పిస్తుంది... ఎప్పుడైనా, ఎంత గొప్ప వారైనా నా తల్లిదండ్రులు... నా తోబుట్టువులు... నా ఇల్లు... నేను చదివిన పాఠశాల... నా గురువులు అని ఏ ఒక్కటి మరిచిపోరు ఎవ్వరూ...

ఇక్కడి యువత బంగరు మనసున్నవారు. తాము పదిమందికి పని కల్పించాలంటే.. అందుకు తగిన డబ్బు సంపాదించడానికి విదేశాలకు వెళ్లినా... సంపాదించుకొని మళ్ళీ భారతదేశానికి రావడం, ఇక్కడే చాలామందికి ఉపాధి కల్పించడం, వ్యవసాయం పునరుద్ధరించడం ఇవన్నీ వింటుంటే ఇది కలా? నిజమా ? అనుకుంటూ... ఏది ఏమైనా ఇది మాత్రం కరోనా మహత్యమే!

....సర్వేజనా సుఖినోభవంతు !



**-రంగరాజు పద్మజ**
99897 58144

## ప్రాణబంధం

అప్పటి వరకు అవి..
ఆకుపచ్చగా మెరుస్తూ
చల్లని గాలిని హాయిగా పంచుతూ
ఊయలలూగినట్లుగా ఊగుతున్న వృక్షాలే అవి..
అక్కడికి ప్రొక్లెయిన్ వచ్చి వెళ్ళాక.
నిర్జీవమైన వృక్షాలై.. ముక్కలై.. నేలకొరిగాయి!
అంతకు ముందు
బాటసారులను సేదతీర్చుతూ
చల్లదనాన్ని పంచుతూ
గ్రీష్మతాపాన్ని తగ్గించి.. నీడనిచ్చే ఆశ్రయాలు అవి
ఇప్పుడేమో.. విగతమై పడివున్నాయి!
మొదళ్ళ ఆనవాళ్ళు కూడా లేకుండా
కూకటివేళ్ళతో సహా పెకిలించి
వికటాట్టహాసం చేస్తున్నట్టుగా ప్రొక్లెయినర్
వాటిని దాటుకుంటూ వెళ్ళిపోయింది!
అంతకు ముందు వరకు
చేయి తిరిగిన చిత్రకారుడు గీసిన అందమైన చిత్రంలా
పచ్చగా ముద్దుగా ముచ్చటగా మెరుస్తూ
దారి వెంట ఓ గొలుసులా పరుచుకున్న పచ్చని చెట్లు!
జన జీవితాలను.. పూలమొక్కలై అలరిస్తూ
ఔషదాలై ఆరోగ్యాన్నిస్తూ
సుమగంధాల పరిమళాలని అందిస్తూ ఆహ్లాదపరుస్తూ
ప్రాణవాయువై జీవంపోస్తూ
ఇంతకాలం సేవచేస్తున్న వాటికి
మనిషి తిరిగిఇచ్చే బహుమతి..
"నరికేసి.. నేలకూల్చి.. ఉనికే లేకుండా చేయడం"
వృక్షరహిత అరణ్యాలుగా పట్టణాలను నిర్మించుకుంటూ
'వృక్షో రక్షతి రక్షతః' అన్న సూక్తి మర్చిపోయి
ప్రాణవాయువు లేని చోట
మనిషి మనుగడే కష్టని తెలుసుకోలేక
మనిషి..తన ఉనికిని
తనే ప్రశ్నార్థకం చేసుకుంటున్నాడు.



**- గొర్రెపాటి శ్రీను**
సెల్: 9652832290

పుస్తక సమీక్ష

# ఆరాధన






అన్యాయంపై పోరాడి, గెలవాలి. తనను నమ్ముకున్న వారికి ధైర్యమై నిలబడాలి ఇవీ హీరోయిజం లక్షణాలు . మరి తనను తాను నిలబెట్టుకొని మాటల తూటాలని ఎదుర్కొంటూ గాయాల పాలైన మనసుకు ఆత్మావిశ్వాసపు లేపనం పూసుకొని అనుక్షణం తన ఉనికికి ఊపిరి పోసే ప్రయత్నం చేస్తూ, విధి, విధాతలను నిందించకుండా జీవితం తనకిచ్చిన అవరోధాల గిరులను దాటుకుంటూ సవాలు విసిరిన వారిని ఏమనాలి... ?? మనసు సరిహద్దుల్లోకి బాధ,విరక్తి,అవివేకం, అసూయ, అసహనాలు వంటి శత్రువులు చేరకుండా ఆత్మావిశ్వాసంతో ముందుకు సాగుతూ పరిస్థితులతో నిత్య పోరాటం చేస్తున్న యోధుడు సైనికుడు కాదా...!

అటువంటి ఓ సైనికుడైన మహమ్మద్ అక్బర్ అంతరంగ గాథతో నిండినదే " ఆరాధన " వచన కవితాసంపుటి.

పుట్టుకతోనో,కాన్పు సమయంలో, పుట్టిన తర్వాతనో లేక ప్రమాదవశాత్తు కానీ వైకల్యం బారిన పడితే వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారు, వారి ఆలోచనల్లో ఎన్ని అంతుచిక్కని ప్రశ్నలుంటాయి, మనసు ఎంత వేదనకు గురవుతుందో... అందరి తరపున ఒక్కడై వాస్తవపు ద్వారాలు తెరిచి తమ ప్రపంచానికి ఆహ్వానిస్తూ నిజాన్ని చూపించే ప్రయత్నం చేసిన సాహసి.అవసరాలే సంబంధాలుగా రూపుమారిన నేటి సమాజంలో నిజాలు మాట్లాడేందుకుధైర్యముండాలి.అంతకుమించి నిజాయితీఉండాలి.నిజం-నిజాయితీ కల గలిపిన నిస్వార్థపు సహజత్వమే మరి తన చిరునామా కదా ...! అందులోనూ తప్పనిపించిన దాన్ని ప్రశ్నించటం, నిజాన్ని నిక్కచ్చిగా చెప్పటమే తెలిసిన వ్యక్తులైన

డాక్టర్.దిలావర్ తనయునిగా, డాక్టర్. షంషాద్ బేగం, డాక్టర్. షాజహానా ల సోదరునిగా ఇంకెంత ఖచ్చితత్వమో వచ్చి ఉండొచ్చు. అలా అని పెద్ద పెద్ద పుస్తకాలు చదివి, వాటి సారాన్ని గ్రహించే

వ్యక్తి కాదు మహమ్మద్ అక్బర్. తన లోపాన్ని కాక ఎబిలిటీని గుర్తించేలా, ప్రోత్సహించిన తల్లి యకూబ్బి, తండ్రి డా. దిలావర్ ల ప్రయత్న ఫలితమే నేడు అక్బర్ ను కవిగా సమాజానికి పరిచయం చేసింది.తన గురించే కాక అందరికోసమనే ఆలోచనకి ప్రాణం పోసింది. మనసు పొరలనుంచి పురుడు పోసుకున్న నిష్కల్మషమైన భావాలు అక్షర రూపాన్ని ధరిస్తే ఆ తనువు పేరే "ఆరాధన" . ప్రేమించడం తప్ప ద్వేషించటం తెలియని ఎద నుండి పొంగిన అక్షర గంగే ఈ "ఆరాధన . "నేను" అనే కవితలో పుట్టినపుడు నేను ఒక్కడినే ఒంటరినే...ఇప్పుడు నేనంటే ..నా సహచారి.., పిల్లలిద్దరు, అమ్మా..అబ్బా.. గురువులు... దోస్తులు.. నా ఊరు ..నా దేశం... విస్తరించిన నిర్వచనం అంటూ తన నిర్వచనాన్నిస్తూ మొదలుపెట్టిన అక్బర్ "నీ లాగే స్పీడ్ గా పరిగెత్తాలనుకుంటా, గడ గడా మాటల పేలాలు వేయించాలనుకుంటా, నీలాగే బ్రతుకును ఎత్తి అవతల పడవేయాలనుకుంటా...తన ప్రమేయం లేకుండా తన బ్రతుకులోకి దూరిన అసహాయతల వల్ల ఎదురుకుంటున్న ఇబ్బందులను వివరించిన తీరు చదువరులను కంట తడి పెట్టేలా చేస్తుంది .ప్రాణానికి ప్రాణంగా పెంచిన తల్లిదండ్రులను గౌరవించడం, రక్తసంబంధం లోని ఆప్యాయతలు ఆ బంధాల నుండి ఏర్పడిన అనుబంధాల పులకరింతలు మాత్రమే కాదు తన హృదయ సామ్రాజ్యం లో కొలువున్న అర్ధాంగిని ఆరాధించడము కూడా తెలుసు. అందుకే మహమ్మద్ అక్బర్ తన అస్తిత్వానికి కేర్ ఆఫ్ అడ్రస్ అలీమా అక్బర్ అని చెప్పకనే చెప్తారు. అంతులేని ఆశల్లో ఇరుక్కున్న మనకు తృప్తి అనే సితార అంతు చిక్కనంత దూరంలో కనిపిస్తోంది. ఈర్ష్య, ద్వేషాలకు తావు లేని ఆలోచనలతో బంధాల్లోని అనుబంధాల తృప్తిని ఆస్వాదిస్తున్న తను లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ... అనే కవితలో నా జీతం ఎంత అని అడిగకండి, నా సంతోషం ఎంత అని అడగండి... అంటూ మనిషి ఆనందంగా జీవించటానికి కావలసింది ,అవసరమైనది ఏమిటో వివరిస్తారు.

వెలకట్ట లేని సంతృప్తిని స్వీకరించిన తనకు మాత్రమే తెలుసు, ఆ ఆనందం ... ఒంటరి పోరాటంలో ఊహించని ఫలితాలు వస్తాయని, విధిని కూడా అధిగమించి ఓర్పుతో మార్పును కోరుకోవాలని తాను పాటించిన సూత్రాన్ని , తన జీవన తంత్రాన్ని వివరిస్తారు.చైతన్యం అనే కవితలో స్థిరత్వం ఉన్న ప్రతిది మరణించినట్టు లెక్క అని బతకటమంటే చైతన్యంతో జీవించటమన్న పదాలు చూస్తుంటే జీవిత సారాన్ని గ్రహించిన తత్వవేత్తలా అనిపిస్తారు.జీవితం ఎప్పుడూ వెక్కిరిస్తూనే ఉంటుంది, ఒక దగ్గర పూడుస్తుంటే మరోచోట ఖాళీ కనబడుతూనే ఉంటుంది (ఐడియా కవితా శీర్షిక ) ప్రతిభను రంగు రూపుల్లో ముడి వేయవద్దని, కష్టమైనా మంచితోనే చెలిమి చేయాలని దైవం సాటి మనుషు లో సాక్షాత్కరిస్తుందని, నీకు నీపైన నమ్మకం ఉంటే యే దేశం తోనైనా యుద్ధం ప్రకటించవచ్చని నీ వాళ్ళు ..నా వాళ్ళు... ఏంటి భయ్యా ?? మనషులంతా మన వారసులే (నమ్మకం శీర్షిక లో) అంటూ ఐక్యతా సూత్రాన్ని గుర్తు చేస్తారు. 46 కవితా శీర్షికల్లో మహమ్మద్ అక్బర్ చేసిన భావ ప్రకటన అర్ధవంతమయినది, ఆలోచింపదగినది,యదార్ధమైనది.

అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ శారీరక ,మానసిక అవరోధాలను దాటుకుంటూ మనోధైర్యం తో ముందుకు సాగుతూ, శారీరక, మానసిక వైకల్యమున్న వారికే కాదు,అన్ని అవయవాలు సరిగ్గా ఉన్నా ఏ లక్ష్యాలు లేకుండా అసంతృప్తి తో, జీవించే ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలచారు. మహమ్మద్ అక్బర్ రచించిన ఈ ఆరాధన అంతా... ప్రేమమయం.

స్వార్థపు నీడలు తాకని మనసు నుండి జాలువారిన కవితాసంపుటి. ఈ భావప్రకటన ఇలాగే కొనసాగి ఎంతో మందికి కనువిప్పు కావాలని, మరెన్నో ఆలోచనలు రచనలై సాహిత్య రంగంలో ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాలని మనః పూర్తిగా కోరుకుంటూ ,ఊహించని మలుపు నుండి కొత్తబాట వైపు అడుగులేస్తూ ఆరాధనకు రూపమిచ్చిన రచయిత మహమ్మద్ అక్బర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. వారి ప్రయత్నానికి నా సెల్యూట్.

**ప్రతులకు:** డా॥ దిలావర్
5-5-11, గాంధీనగర్
నవభారత్,
పాలవంచ-507 154
సెల్: 9866923294



**-షేక్.నసీమా బేగం**
9490440865

## నీది ఏ దారి

ఓ మనిషి ఎటు వైపు
నీ పయనం
ఏ ఆశయం కొరకు ఆరాటం
చేసేవి చెండాలపు పనులు
చెప్పేవి శ్రీరంగ నీతులు
గతమెంత ఘనచరిత్రైనా
భవిష్యత్తంతా అంధకారం!

రాతి యుగం నుండి రాకెట్ల
యుగమొచ్చినా
కంప్యూటర్ యుగంలోను కానరాని మంచితనం
ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి మనిషి
మనిషులు మారాలి అన్నాం కానీ.....
పశువుల్లా కాదనేది జగమెరిగిన సత్యం!

దేశంలో ఏదో ఓ మూలనో
ప్రతి నిమిషానికి ఎన్నెన్నో
అఘాయిత్యాలు
నిరంతరం సాగుతునే
ఉన్నాయి దుశ్చర్యలు
రగులుతునే ఉన్నాయి
రావణ కాష్టాలు
మతాల పేరుతో మారణహోమాలు
కులాల పేరుతో కుట్రలు!

ఆధునిక యుగంలోను
అర్థం కాని మనుషులు
దొంగతనాలు దోపిడీలు
కుట్రలు కుతంత్రాలు
హత్యలు ఆసిడ్ దాడులు
పసి మొగ్గల చెరిచే పాపాత్ములు
పండుటాకుల పై పైశాచికత్వం
మహిళలపై అఘాయిత్యాలు
ఇంకెంత కాలం ఈ దౌర్జన్యాలు
ఓ మనిషి ఎటు వైపు నీ పయనం!



**-కోణం పర్శురాములు**
9959524585

